J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 52 29.5.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# దేశంలో బొద్దింకల కలకలం

## ఇది విప్లవమా లేక విఫలమా?



- దేశాన్ని ఊపేస్తున్న జెన్ జీ
- డిజిటల్ విప్లవంగా కాక్రోచ్ జనతా పార్టీ
- వారం వ్యవధిలో 2 కోట్లు దాటిన ఫాలోవర్స్
- సోషల్ మీడియా ఖాతాలపై కేంద్రం బ్యాన్
- అనుకూల, వ్యతిరేక వాదాలతో మాటల యుద్ధం

భారతాన బొద్దింకల దండు ప్రారంభించిన డిజిటల్ యుద్ధం ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. యువతలో నివురుగప్పిన నిప్పులా పేరుకున్న అసంతృప్తి, సామాజిక మాధ్యమాల సాక్షిగా ఎగసి... ఎగసిపడుతోంది. ప్రపంచంతో పోటీపడేందుకు ఆపసోపాలు పడుతున్న మన యువతరం, దీనికి కారణమైన వ్యవస్థలను సమూలంగా ప్రక్షాళన చేయాలని పంతం పడుతోంది. మార్పు తప్పనిసరి అంటూ నినదిస్తోంది. అయితే, ఈ ఆక్రోశం వెనుక దేశాన్ని విచ్ఛిన్నం చేసే అతిపెద్ద కుట్ర ఉందని, యువతను తప్పుదారి పట్టించే ఎత్తుగడ ఉందన్నది పాలకుల వాదన. అదే నిజమైతే దేశాన్ని రక్షించుకునేందుకు అందరూ సమాయత్తం కావాల్సిందే. కానీ సాంప్రదాయ రాజకీయ సిద్ధాంతాల మాటున మన యువత ఆవేదనను అర్థం చేసుకోకుంటే..? ప్రశ్నించే గొంతులను అణచాలని చూస్తే దేశ భవిష్యత్తే ప్రశ్నార్థకం అవుతుంది. వెబ్‌సైట్‌లను నిషేధిస్తే అభిప్రాయాలు మారిపోతాయని, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను బ్యాన్ చేస్తే వ్యతిరేకించే స్వరాలు మూగబోతాయని భావించడం అవివేకమే. మరి మారాల్సింది దేశ యువతా, తగ్గాల్సింది పాలకులకు తలకెక్కిన మగతా..! 'లాయర్' ప్రత్యేక కథనం..!

2లో





## స్వప్నం సాకారమవుతున్న వేళ.. సంగీతప్రియుల ఆనందహేల

## మన వెంకయ్యనాయుడుచే జూన్ 4న

# బాలు స్మారకం ఆవిష్కరణ



ఎట్టకేలకు చాలాకాలం తర్వాత నెల్లూరీయులు, బాలూ అభిమానుల కల సాకారం కానుంది. బాలూ తిరుగాడిన నెల్లూరు గడ్డపై ఆయన విగ్రహం నెల కొల్పాలనే అభిమానుల కోరిక తీరనుంది. తన మధురగానంతో, వేలాది పాటలతో అశేషప్రజానీకాన్ని ఉర్రూతలూగించిన భారతీయ సినిమా గాయకుడు, గాన గంధర్వుడు.. పద్మవిభూషణుడు.. డా. యస్పీ బాలసుబ్రహ్మణ్యం(బాలు) స్మార కంగా నెల్లూరు నగరంలో బాలూ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముహూర్తం ఖరారైంది. ఒక్క నెల్లూరునీమలోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా ఆయన అభిమానులకు ఇది పెద్దపండుగగా, కన్నులపండుగ చేయ నుంది. బాలూ 80వ జయంతి రోజున, ఆయనకెంతో ప్రీతిపాత్రమైన అన్నమయ్య విగ్రహం చెంతనే, ఆయన విగ్రహం కూడా కొలువుదీరనుంది. జూన్ 4వ తేదీ గురు వారం సాయంత్రం 5.30 గంటలకి, నగరంలోని మినీబైపాస్‌రోడ్డు, అన్నమయ్య కూడలిలో ఎన్టీఆర్ పార్కు వద్ద.. బాలూ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరుగ నుంది. భారత 13వ ఉప రాష్ట్రపతి.. మన నెల్లూరీయులు.. భరతమాత ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు పాల్గొని నెల్లూరీయులు..బాలూ అభిమానులందరి సమక్షంలో 10 అడుగుల ఎత్తున్న బాలూ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

ఈ సంగీత పండుగకు శాంత బయో టెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మన్.. పద్మభూషణ్ డాక్టర్ కెఐ వరప్రసాద్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు ఆచార్య సియంకె రెడ్డి, ప్రముఖ సినీసంగీత దర్శకులు యం.యం.కీరవాణి, మణిశర్మ, సుప్రసిద్ధ సినీ నేపథ్యగాయకులు నాగూర్‌బాబు(మనో) ఆత్మీయ అతిథులుగా విచ్చేయనున్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, అర్బన్‌రైజ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంబూరు మనోజ్, ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ ఆల్లూరు మహేష్‌రెడ్డి, పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి గ్రోసు సుబ్బారావు విచ్చేయనున్నారు. 'లాయర్' వార్తాపత్రిక సంపాదకులు.. తుంగా శివ ప్రభాత్‌రెడ్డి సమన్వయంతో, తాటి చలపతి రావు (శ్రీ భారత్ బిల్డర్స్), రామిరెడ్డి సాకేత్ రెడ్డి (ఎస్+ఆర్ ఆర్కిటెక్ట్స్)ల సహకారంతో బాలూ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం అత్యంత వైభవంగా జరుగనుంది.

### బాలూకి సంగీతజ్ఞుల సుస్వరార్చన

ఈ వేడుకలో భాగంగా నెల్లూరు ముద్దుబిడ్డ.. మన బాలూ 80వ పుట్టినరోజును స్మరించుకుంటూ ప్రఖ్యాత సంగీత-గాన కళాకోవిదులతో ఆయనకు సుస్వరహారతిగా.. 'స్వరనీరాజనం' పేరుతో సంగీతార్చన కార్యక్రమాన్ని వీనులవిందుగా.. నయన మనోహరంగా నిర్వహించనున్నారు. ఈ సంగీత సుస్వరార్చనలో బాలూతో కలసి ఎన్నో సంగీతకచ్చేరీలు చేసిన ప్రఖ్యాత సినీసంగీత వేత్తలు.. ప్రసిద్ధ గాయకులు కీరవాణి, మణిశర్మ, మనోలతో పాటు..బాలూ కుటుంబసభ్యులు యస్‌పి శైలజ, యస్‌పి వసంత, యస్‌పి చరణ్, యస్‌పి అభిషేక్‌లు పాల్గొననున్నారు. బాలూ పుట్టినరోజు..అందరికీ పండుగ రోజు!.. ఈ వేడుకకు సింహపురీయులతో పాటు బాలూ అభిమానులందరికీ స్వాగతం పలుకుతున్నారు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ నిర్వాహకులు...!

# దేశంలో బొద్దింకల కలకలం

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం దేశంలో మెయిన్ స్ట్రీమ్ మీడియా చేయలేని, చూపెట్టలేని, ఎన్నో అంశాలను, లోపాలను సోషల్ మీడియా వెలుగులోకి తెస్తోంది. ఫలితంగా దేశ ప్రజలు తమ అభిప్రాయాలను నెట్టింట స్వేచ్ఛగా పంచుకుంటూ, వ్యూస్‌ను పెంచుకుంటూ సామాజిక మాధ్యమాల్లో ఖాతాలను ప్రారంభిస్తున్నారు. ఇన్‌స్టా, ఎక్స్, ఫేస్‌బుక్ అంటూ నచ్చిన అంశాన్ని, అందరూ మెచ్చే విధంగా ప్రజెంట్ చేస్తున్నారు. మెసేజ్‌లతో మెస్మరైజ్ చేస్తూ, పోస్టులను హోరెత్తిస్తున్నారు. ఫలి తంగా తమకు తోచిన విషయాన్ని జనబాహుళ్యంలోకి పక్కా స్కెచ్‌తో తీసుకెళ్తున్నారు. ఇదే కోవలో ఎక్స్ వేదికగా సెటైరికల్ ఖాతాగా ప్రారంభమైందే కాక్రోచ్ జనతా పార్టీ. అయితే, అంతకంతకూ విజృంభిస్తూ యువతను ఆకర్షిస్తూ సమ్మోహన శక్తిగామారి కాకలు తీరిన రాజకీయ పార్టీల ఖాతాలనే కిందికినెట్టి, నెట్టింట తనకు తిరుగేలేదని నిరూపించింది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రస్తుతం సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేస్తున్న డిజిటల్ యుద్ధంగా యువత దీన్ని భావి స్తోంది. ఇలాంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం కాక్రోచ్ జనతాపార్టీ సోషల్ మీడియా ఖాతాలను నిషేధి చడం, వెబ్‌సైట్‌ను బ్యాన్ చేయడం చర్చనీయాంశంగా మారింది. దేశాన్ని దద్దరిల్లేలా చేసి ఉవ్వెత్తున ఎగిసిన కాక్రోచ్ జనతాపార్టీపై అసలెందుకు నిషేధం విధించే పరిస్థితి వచ్చింది..? దేశంలో వాక్ స్వాతంత్ర్యం పేరుకు మాత్రమే ఉందా..? అసలు జెన్‌జీ భావాలను పాలకులు అర్థం చేసుకుంటున్నారా..? నివురు గప్పిన నిప్పులా మారిన యువత ఆవేదనను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో పరిమాణాలు ఏస్థాయికి దిగజారుతాయి అన్నది ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది.

### కాక్రోచ్ జనతాపార్టీ ఎందుకు పుట్టుకొచ్చింది..?

ఇటీవల ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, దేశంలో కొందరు నిరుద్యోగులు సోషల్ మీడియా ఇన్ఫ్లూయన్సర్లుగా, సామాజిక కార్యకర్తలుగా, ఆర్టీఐ(సమాచారహక్కు) యాక్టివిస్టులుగా ఉంటూ వంటగదిలో బొద్దింకల తరహాలో సమాజాన్ని విసిగిస్తున్నారని, పరాన్నజీవు లుగా ఉంటూ ఉద్రిక్తతలకు కారణమవుతున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత, విస్మయం వ్యక్తమైంది. ముఖ్యంగా యువతలో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. దేశ అత్యున్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి దేశ యువతను, నిరుద్యో గులను కించపరిచేలా వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సహేతుకం కాదనే వాదనలూ జోరం దుకున్నాయి. దీనిపై సీజే వివరణ ఇస్తూ తాను యువ కులందరినీ బొద్దింలు, పరాన్నజీవులు అనలేదని, దొంగ డిగ్రీలతో సమాజంలో అలజడి సృష్టిస్తున్న నకిలీ లాయర్లు, సోషల్ మీడియా నిర్వాహకుల అసంబద్ధ చర్యలను మాత్రమే గుర్తుచేశానని స్పష్టం చేశారు. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రధానంగా దేశంలోని జన్‌జీ (2000 సంవత్సరం తర్వాత జన్మించిన తరం) సీజే వ్యాఖ్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తూ సోషల్ మీడియాలో పోస్టులను హోరెత్తించింది. సరిగ్గా ఇదే సమయంలో మహారాష్ట్రకు చెందిన అభిజిత్ దీప్కే అనే యువకుడు సీజేఐ వ్యాఖ్యలను ఉటంకిస్తూ వ్యంగ్యంగా "కాక్రోచ్ జనతా పార్టీ" పేరిట ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. ఈ పోస్టుకు 48 గంటల్లోనే వేలాది లైకులు వచ్చాయి. మేమూ కాక్రోచ్‌లమే(బొద్దింకలం) అంటూ పెద్దఎత్తున యువత అభిజిత్ దీప్కే పోస్టుకు జైకొట్టారు. దీంతో కేంద్రప్రభుత్వం యువతను రెచ్చగొట్టే పోస్టులు తగ వంటూ సదరు ఎక్స్ ఖాతాను తొలగించింది. అయితే, వంటగదిలో ఒక కాక్రోచ్‌ను చంపితే పెద్దఎత్తున పుట్టుకొస్తాయంటూ కాక్రోచ్ జనతాపార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను, ప్రత్యేక వెబ్‌సైట్‌ను అభిజిత్ దీప్కే ప్రారం భించారు. వీటికీ అనూహ్య స్పందన వచ్చింది. దాదాపు 20 మిలియన్ల మంది తామూ కాక్రోచ్ జనతాపార్టీలో చేరుతామంటూ పోస్టులను హోరెత్తించారు. ఇవి ఎంతగా అంటే దేశంలో ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల సంఖ్యను సైతం అధిగమించాయి. దీంతో కాక్రోచ్ జనతాపార్టీ ఖాతాను ప్రారంభించిన అభిజిత్ దీప్కే దేశంలో యువతరం మేలుకొని దశాబ్దాలుగా పాతుకుపోయిన పాత వ్యవస్థ లకు చెక్‌పెట్టి, సరికొత్త వ్యవస్థ ఆవిర్భావానికి పురుడు పోయాల్సిన సమయం ఆసన్నమైందంటూ పిలుపుని చ్చారు. ఈ క్రమంలోనే ఒకవేళ కాక్రోచ్ జనతాపార్టీ అధికారంలోకి వస్తే మొదట సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌లు పదవీ విరమణ తర్వాత రాజ్యసభ ఎంపీలుగా ఎన్నిక కాకుండా చర్యలు చేపడతామని ప్రకటించారు. అదే సందర్భంలో ఎస్ఐఆర్(సర్) పేరుతో అర్హులైన ఓటర్లను అడ్డగోలుగా, అన్యాయంగా తొలగిస్తే భారతదేశ ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కూడా అరెస్టు చేసేలా చట్టాన్ని తెస్తామంటూ ప్రకటించారు. ఇక దేశంలో అధికార పార్టీలకు వంతపాడే పాలకుల జేబు సంస్థలుగా మారిన దిగ్గజ మీడియా సంస్థలను, పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్న మీడియా హౌస్‌లను నిషేధిస్తా మని స్పష్టం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం కాదు 50 స్థానాలను రిజర్వ్ చేసేలా చట్టం తీసుకొస్తామన్నారు. అలాగే ఎన్నికల్లో ఓ పార్టీ తరపున గెలిచి తర్వాత ఇతర పార్టీల్లోకి మారే నాయకులు 20 ఏళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధిస్తామని తేల్చిచెప్పారు. ఈ 5 అంశాలనే తమ పార్టీ మేనిఫెస్టోగా ప్రధాన లక్ష్యాలుగా ప్రకటించి వాటి అమలు కోసం నిత్యం పోరాటం చేస్తామని అభిజిత్ దీప్కే స్పష్టం చేశారు. దీంతో యువతే కాకుండా, మధ్యవయస్కులు, ఉన్నత విద్యావంతులు, మేధావులు, రాజకీయ నాయకులు మేమూ కాక్రోచ్ జనతాపార్టీలో చేరుతామని ముందుకొచ్చారు. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ ఫాలోయర్ల సంఖ్య అనూ హ్యంగా పెరిగిపోయింది.

### లక్ష్యం మంచిదే అయినా..?

అభిజిత్ దీప్కే వ్యంగ్యాత్మక దృక్పథంతో రాజకీయ వ్యవస్థ, విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించేందుకు ప్రారంభించిన కాక్రోచ్ జనతాపార్టీ ఇన్‌స్టా పేజీ లక్ష్యం మంచిదే అయినా, విధానపరమైన లోపం కారణంగా పలు విమర్శలను మూటకట్టుకుంది. ఇతర దేశాల్లో ఉంటూ భారత్‌పై విషం కక్కేలా, కొందరు విదేశీ శక్తులతో కలిసి అభిజిత్ దీప్కే పనిచేస్తున్నారనే ఆరో పణలు వెల్లువెత్తాయి. అదే సమయంలో కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ సోషల్‌మీడియా వ్యవహారాలను కొద్ది కాలం పాటు గతంలో అభిజిత్ దీప్కే పర్యవేక్షిం చారని, ప్రధాని మోదీపై యువతలో వ్యతిరేకత పెంచే ఏకైక ఉద్దేశంతోనే కాక్రోచ్ జనతాపార్టీని తెరపైకి తీసుకొచ్చారనే చర్చ రచ్చరచ్చగా మారింది. ముఖ్యంగా కాక్రోచ్ జనతాపార్టీని అనుసరించే ఫాలోయర్లలో 49 శాతం పాకిస్థానీయులని, మిగిలిన వారు భారత్‌పై తీవ్ర వ్యతిరేకతను నూరిపోసే బంగ్లదేశ్, యూకే, కెనడా వంటి దేశాలకు చెందిన వారనే ఆరోపణలూ వెల్లువెత్తాయి. భవిష్యత్‌లో భారత్‌లో కల్లోలం సృష్టిం చేందుకే ప్రతిపక్షాల సపోర్ట్‌తో ఓ వర్గం జెన్‌జీ యువతను రెచ్చగొడుతోందని, విధ్వంసాలకు పాల్పడే అవకాశం కోసం ఎదురు చూస్తోందని పలువురు విమర్శలు గుప్పించారు. అయితే వీటిని అభిజిత్ దీప్కే ఖండించడంతో పాటు కాక్రోచ్ జనతాపార్టీని అనుస రించే నెటిజన్లలో 94 శాతం ఇండియన్లే ఉన్నారని చెప్పారు. కానీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సమైఖ్యత, సమగ్రత కోసం కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన అన్ని సోషల్ మీడియా ఖాతాలను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో వారం పాటు ఉవ్వె త్తున ఎగిసిపడిన కాక్రోచ్ జనతాపార్టీ ఆదిలోనే అడ్డం కులను అధిగమించలేక ఉనికి కోల్పోయింది. తమ పార్టీ ఖాతాలన్నీ హ్యాకింగ్‌కు, నిషేధానికి గురయ్యాయని అభిజిత్ దీప్కే నిస్సహాయత వ్యక్తం చేశారు. అదే సందర్భంగా యువత వాక్ స్వాంత్రత్ర్యాన్ని కేంద్రం ఖూనీ చేసిందంటూ వ్యాఖ్యానించారు. పలువురు ప్రతిపక్ష నేతలు సైతం ఇదే తరహా విమర్శలు చేశారు.

### దేశ రాజకీయ వ్యవస్థకు పెను హెచ్చరికే

కాగా, ఇతర ఉద్దేశాలు, కారణాలు ఏవైనా, కాక్రోచ్ జనతాపార్టీ కేవలం గంటలు రోజుల వ్యవధి లోనే కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించడం మాత్రం కచ్చితంగా ఆలోచించాల్సిన విషయమే. ఎందుకంటే ఓ అంశంపై దేశంలోని యువత అతి తక్కువ వ్యవధిలో ఇంతపెద్ద స్థాయిలో స్పందించడం ఆషామాషీ విషయం కాదు. వారిలో ఏళ్లకేళ్లుగా గూడు కట్టుకున్న నిర్వేదం, ఆవేదన, అసహనం, అసంతృప్తి ఒక్కసారిగా కాక్రోచ్ జనతాపార్టీ వేదికగా వ్యక్తమైందని, పరోక్షంగా వ్యవస్థలో మార్పు కావాలని కోరుకుంటున్న జన్‌జీ తరం మనసులోని మాటే కాక్రోచ్ జనతాపార్టీ ఎదుగుదలకు కారణమైందన్న వాదనలూ వినిపిస్తు న్నాయి. ప్రపంచంతో మన దేశ యువత పోటీ పడా లంటే మన విద్యావ్యవస్థలో సమూల మార్పులు కావా లని, ఉపాధి కల్పనతో పాటూ విజ్ఞానాన్ని, పరిశోధ నాత్మక దృక్పథాన్ని పెంచే కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వా లని మేధావులు సైతం ఘంటాపథంగా చెప్తున్నారు. సాంప్రదాయ పద్ధతిలో ఆరుబయట ఎండాకాలం చదువులతో ప్రపంచ మేటి విద్యార్థిగా భారతీయ విద్యార్థులను తీర్చిదిద్దలేమని స్పష్టం చేస్తున్నారు. ఇదే సమయంలో ప్రస్తుతం శ్రమశక్తికి, ఆవిష్కరణలకు, ఉత్పత్తి సాధనకు ఉపయోగపడే యువతరం భావాలను పట్టించుకోకుంటే, వారి ఆవేదనను అర్థం చేసుకోకుంటే భవిష్యత్‌లో విపరీత పరిణామాలు తప్పవని హెచ్చ రిస్తున్నారు. మన చుట్టూ ఉండే నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలతో పాటు ప్రపంచంలోని చాలా దేశాల్లో వచ్చిన రాజకీయ మార్పులు, పోరాటాలు జన్‌జీ యువతలో దాగున్న అసంతృప్తికి నిదర్శనాలని సూచిస్తున్నారు. వాటిని దూరదృష్టితో పరిశీలించి భావి భారతాన్ని అసలైన విజ్ఞాన సంపద పంచే దేశంగా తీర్చిదిద్దాల్సి ఉంది. ఉద్యోగం చేసే చదవులకు స్వస్తి చెప్పి, ఉద్యోగాల సృష్టికర్తలను తయారు చేసే పాఠ్య ప్రణాళికలను రూపొందించాల్సి ఉంది. ఇందుకోసం డిమాండ్ సప్లయ్ సూత్రంపై పనిచేసే మార్కెట్‌ను శాసించేలా కొత్త ఆవిష్కరణలు నైపుణ్యాలతో వృద్ధి చెందే యువతరానికి బాల్యం నుంచే తర్ఫీదు ఇవ్వాలి. పాఠశాల స్థాయి నుంచే వాటికి మార్గనిర్దేశం జరగాలి. అప్పుడే బడబాగ్ని తనలో ఉందని తెలిసినా చలించ కుండా ఉండే అగ్నిపర్వతంలాగా, సునామీ అలలు తనలో ఉన్నాయని తెలిసినా పైకి ప్రశాంతంగా ఉండే సముద్రుడిలా భారత యువత స్థితప్రజ్ఞతను ప్రదర్శి స్తారు. దేశ అభివృద్ధికి మేము సైతం అంటూ పాటుపడతారు. జై హింద్..!


ఆహ్వానము
భారతీయ సినిమా గాయకులు, గానగంధర్వులు
'పద్మవిభూషణ్'
శ్రీ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి
80వ జయంతి సందర్భంగా
కాంశ్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం.
వేడుక : జూన్ 4, 2026 గురువారం
సాయంత్రం 5.30 గంటలకి
వేదిక : ఎన్టీఆర్ పార్క్, అన్నమయ్య కూడలి,
మినీబైపాస్‌రోడ్డు, నెల్లూరు.
ఆవిష్కర్తలు
శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారు
భారతదేశ 13వ ఉప రాష్ట్రపతి వర్యులు
ఆత్మీయ అతిథులు
'పద్మభూషణ్' డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి గారు
వ్యవస్థాపక ఛైర్మెన్, శాంత బయోటెక్నిక్స్
శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు
దేవాదాయ శాఖామాత్యులు, ఆంధ్రప్రదేశ్
శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు
పార్లమెంటు సభ్యులు, నెల్లూరు
ఆచార్య సి.యం.కె.రెడ్డి గారు
అధ్యక్షులు, అఖిల భారత తెలుగు సమాఖ్య
శ్రీ మణిశర్మ గారు
ప్రముఖ సినీ సంగీత దర్శకులు
డాక్టర్ పొంగూరు నారాయణ గారు
పురపాలక శాఖామాత్యులు, ఆంధ్రప్రదేశ్
శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారు
శాసనసభ్యులు, నెల్లూరు గ్రామీణం
శ్రీ యం.యం.కీరవాణి గారు
ప్రముఖ సినీ సంగీత దర్శకులు
శ్రీ నాగూర్‌బాబు (మనో) గారు
ప్రముఖ సినీ నేపథ్య గాయకులు
ప్రత్యేక ఆహ్వానితులు
డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గారు
మేనేజింగ్ డైరెక్టర్, శ్రీసిటి
శ్రీ నంబూరు మనోజ్ గారు
ఛైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్, అర్బన్‌రైజ్
శ్రీ వీరిశెట్టి హజరత్‌బాబు గారు
ఎం.డి., పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
శ్రీ ఆల్తూరు మహేష్‌రెడ్డి గారు
ఛైర్మెన్, ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్
శ్రీ గ్రోసు సుబ్బారావు గారు
ఎం.డి., మురళీకృష్ణ హోటల్స్
సమన్వయం - సహకారం
శ్రీ తుంగా శివప్రభాత్‌రెడ్డి
సంపాదకులు, 'లాయర్' వార్తాపత్రిక
శ్రీ తాటి చలపతిరావు
శ్రీ భారత్ బిల్డర్స్
శ్రీ రామిరెడ్డి సాకేత్‌రెడ్డి
ఎస్ + ఆర్ ఆర్కిటెక్ట్స్
అందరూ ఆహ్వానితులే!

లాయర్
మే 29, 2026

# ప్రాణాలకే 'పొగ'బెడుతున్న పొగాకు

'చుట్ట-బీడీ-సిగరెట్' కాదేదీ రోగాలకనర్హం'.. అన్నట్లుగా తయారవుతోంది సమాజంలో నేటి పరిస్థితి. 'సరదా సరదా సిగరెట్టు' అంటూ పొగపీల్చడం ఫ్యాషన్ అన్నట్లుగా తయార్రై, ఆ తర్వాత అది మన ప్రాణాలనే పీల్చేస్తున్నా, ఎవరూ లెక్కచేయని దుస్థితి. ధూమపానం చేయడం, పొగాకు నమలడం వంటి దురలవాట్ల వల్ల రోగాలు చుట్టుముట్టి జీవితాలను నుసి చేసిపారేస్తున్నాయని, కనుక వాటికి దూరంగా ఉండాలంటూ అటు ప్రభుత్వాలు, ఇటు వైద్యనిపుణులు నెత్తీనోరూ మొత్తుకుంటున్నా మనవాళ్ళలో చలనం ఉండడం లేదు. 'కాకి అరుస్తూనే ఉంటుంది..కరవాడ ఎండుతూనే ఉంటుంది' అన్న సామెతగా, ఎవరెన్ని హితవులు చెప్పినా పొగాకుప్రియులు మాత్రం వాటిని వదులుకోలేకపోతున్నారు. అంతేకాదు, రోజురోజుకు ధూమపానం చేసేవారి సంఖ్య పెరిగిపోతూనే ఉంది తప్ప తరగడం లేదు. దేశంలో మనిషికి ప్రాణంపోసే పాలు నీళ్ళు దొరక్కపోవచ్చేమో గానీ, ప్రాణం తీసే పొగాకు ఉత్పత్తులు, నిషేధిత మత్తుపదార్థాలు మాత్రం బోలెడన్ని దొరుకుతుంటాయి. ధూమపానం వల్ల అటు పొగ తాగేవారు, ఇటు పక్కనుండి ఆ పొగను పీల్చేవారు సైతం అనారోగ్యాల పాలవుతూనే ఉన్నారని, ఇలా ఎంతోమంది ఈ పొగతో లేనిపోని అనారోగ్యాలకు గుర్రై చనిపోతున్నారని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి 'సిగరెట్ స్మోకింగ్ ఆరోగ్యానికి ప్రమాదం' అని పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. అంతేకాదు, పొగాకు వినియోగం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యుహెచ్ఓ) లెక్కగట్టి మరీ చెప్తోంది. ఒక్క భారత్‌లోనే కనీసం 13.5 లక్షల మంది ఈ దురలవాటుతో మృత్యువాత పడుతున్నారని అంచనా. మనదేశంలో సగటున రోజుకు మూడున్నర వేలమంది ఈ దురలవాటుకు బలైపోతున్నారంటే, ఈ పొగాకు ఎంతటి ముప్పుగా తయారవుతోందో ఊహించుకోవచ్చు. రానురాను మానవాళి ఆరోగ్యానికి ఇదో సవాలుగా మారుతోంది కూడా. ఎంచక్కా దమ్ముకొడితే మజాగా ఉంటుందన్న సంగతి తర్వాత, ముందు వొళ్ళంతా రోగాలు కమ్ముకుంటాయి. ఆ తర్వాత విచారించి ప్రయోజనం ఉండదు. ఎందుకంటే, పొగాకు పొగ విషవాయువు లాంటిది. దానిలో వేలాది రకాల హానికరమైన రసాయనాలున్నాయి. వాటిని పీలిస్తే రోగనిరోధక శక్తి తగ్గిపోతుంది. శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతిని జబ్బులు చుట్టుముడతాయి. ఆగని దగ్గు, ఆయాసం, టీబీతో పాటు క్యాన్సర్ సంబంధిత మరణాల్లో 33శాతం మరణాలు పొగాకు వాడకంవల్లే జరుగుతున్నాయని వైద్యనిపుణులు చెప్తున్నారు. ఇంకా గుండెజబ్బులు, గుండెపోటు, మధుమేహం, పక్షవాతం, ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, పేగు క్యాన్సర్, అన్నాశయం, మూత్రపిండాల క్యాన్సర్ల వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయి. శ్వాస నాళాలను ధ్వంసం చేస్తాయి. ఒక్క పొగాకే కాదు, ఖైనీలు, హుక్కాలు.. పేరేదైనా ప్రమాదం ఒకటే. ఒక్కసారి పొరపాటునో గ్రహపాటునో వీటికి అలవాటుపడ్డామంటే, ఇక అధోగతే. నిండు నూరేళ్ళు హాయిగా బతకాల్సిన వాళ్ళు అర్థాంతరంగానే చావుని కొని తెచ్చుకుంటున్నారు. ఆ చావు కూడా గబుక్కున రాదు. రోగాలతో ఆసుపత్రుల పాలై నరకయాతనలు పడాల్సిందే. దీనికిక వేరే ప్రత్యామ్నాయం ఏమీలేదు. పొగాకు వాడకానికి దూరంగా ఉండడమొక్కటే పరిష్కార మార్గం. చాలామంది చిన్నతనంలోనో, యువతరంలోనో వీటికి అలవాటు పడుతుంటారు. పొగాకులో ఉండే నికొటిన్ అనే విషపదార్థం వారిని బానిసలుగా చేసుకుంటుంది. ఈ అలవాటే దురలవాటుగా మారి, వ్యసనమై చుట్టుకుంటుంది. చివరికి అది లేనిదే బతకలేమనే దౌర్భాగ్యపరిస్థితి దాపురిస్తుంది. అయితే, పట్టుదల ఉంటే వాటి వాడకం మానడం పెద్ద పనేమీ కాదు. ఏదేమైనా, సమాజాన్ని నాశనం చేస్తున్న ఈ దురలవాటును రూపుమాపాలనే సంకల్పంతో, పొగాకు వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ, పొగాకు రహిత జీవనశైలితో అందరూ ఆరోగ్యంతో జీవించాలంటూ మే 31న ప్రపంచవ్యాప్తంగా 'పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు. 'పొగ-జీవితాలను నాశనం చేసే సెగ, 'పొగాకు కాదది 'పగాకు'. తమను కాల్చేవారిని పగబట్టి మరీ కాలుస్తుంది. సిగరెట్టుకు ఒక కొస నిప్పు ముట్టిస్తే, రెండో కొస మన జీవితాలకే నిప్పు పెడుతుంది'.. అంటూ విజ్ఞులు, వైద్యనిపుణులు హెచ్చరిస్తూ సమాజాన్ని చైతన్యవంతం చేసే రోజు అది. ముఖ్యంగా విద్యార్థులు, యువత పొగాకుతో జీవితాలకు పొగపెట్టుకోకుండా ఆరోగ్యం పట్ల అవగాహనతో ఉండాలి. 'పొగాకుకు ఎంత దూరంగా ఉంటే ఆరోగ్యానికి అంత మంచిది మరి!'.. తస్మాత్ జాగ్రత్త!....

**(మే 31.. అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం)**

# లోకేష్‌కి అధికార పగ్గాలు అప్పజెప్పడం అంత సులభం కాదు!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఇటీవల కొన్ని పత్రికలలో, ముఖ్యంగా మన 'లాయర్'లో 2027లో లోకేష్ అధికార పగ్గాలు చేపడతాడన్న వార్త ప్రధానంగా వస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా ఇప్పుడు అందరి నోటా ఇదే చర్చ సాగుతోంది. '2026 ఉగాది తర్వాత నారా లోకేష్ ముఖ్యమంత్రి అవుతారు' అనే పుకారు కూడా జోరందుకుంది. అయితే, 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి లోకేష్‌ను 'వారసుడి'గా తెరపైకి తెచ్చే ప్రయత్నం జోరుగా సాగుతుందనడంలో సందేహం కూడా లేదు. పార్టీలోని యువ నాయకులు అనేక సందర్భాల్లో లోకేష్‌ని సీఎం అభ్యర్థిగా సమర్థించారు.

ఇలాంటి తరుణంలో అనేక అనుమానాలు మన ముందున్నాయి. పరిపాలనలో లోకేష్‌కి ఇంకా సీనియారిటీ లేదు. అలాంటిది ఒక్కసారిగా సీఎం పీఠం అప్పగిస్తే పార్టీలో సీనియర్ల నుండి అసంతృప్తి వచ్చే అవకాశం వుంది. మరోవైపు పవన్ కల్యాణ్, బీజేపీ అంగీకారం లేకుండా ఏకపక్ష నిర్ణయం సాధ్యం కాదు. లోకేష్‌కి అధికారం ముట్టచెప్తే 'కుటుంబ పాలన' అనే విమర్శలకు మరింత పదునుపెట్టినట్టు కూడా అవుతుంది. అయితే, 2027ఉగాది నాటికి ప్రభుత్వానికి మూడేళ్ళు పూర్తవుతాయి. 2029 ఎన్నికలకు రెండేళ్ళ ముందు యువ నాయకత్వాన్ని ముందు పెట్టి , 'యాంటీ-ఇన్‌కంబెన్సీ'ని తగ్గించుకోవడం కూడా ఒక వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, చంద్రబాబు, లోకేష్ మాత్రం ఈ పుకార్లపై స్పందించడం లేదు. లోకేష్‌ను సీఎం చేయడం టీడీపీ అంతర్గత వ్యవహారం. కానీ అది 'వారసత్వం' కోసమా, 'సమర్థత' కోసమా అన్న విషయం ప్రజలు తేల్చుకోవాలి. పదవుల పంపకం కంటే, ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగ కల్పన, అభివృద్ధిపై దృష్టిపెడితేనే ఏ నాయకుడికైనా ప్రజామోదం దక్కుతుంది. లేకుంటే 'ఉగాది' సందర్భంగా చెప్పే 'పంచాంగ శ్రవణం' లాగే, ఈ పుకారు కూడా వచ్చే ఏడాదికి పాతబడిపోతుంది.

*కే.వీ.కుమార్,* **బాలాజీనగర్, నెల్లూరు.**

# కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్ళీ మొదలైన కుర్చీలాట!

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లవుతున్నా, పాలన కంటే పదవుల పంచాయితీకే ఎక్కువ ప్రాధాన్యత కనిపిస్తోంది. 2023లో ఆ పార్టీ గద్దెనెక్కేందుకు కుదుర్చుకున్న 'పవర్ షేరింగ్' ఒప్పందమే ఇప్పుడు రాష్ట్రానికి శాపంగా మారింది. ముఖ్యమంత్రి కుర్చీ కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ వర్గాలు ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ప్రజలు కరువు, నిరుద్యోగం, ధరల భారంతో అల్లాడుతుంటే, ఈ నేతలు మాత్రం హైకమాండ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 'డీకే శివకుమారే తదుపరి ముఖ్యమంత్రి' అంటూ రాష్ట్రంలో అక్కడక్కడా పోస్టర్లు వెలియడం, కేకులు కోయడం చూస్తుంటే పార్టీలో క్రమశిక్షణ ఏ స్థాయిలో దిగజారిందో అర్థమవుతోంది. గ్రేటర్ బెంగళూరు, స్థానిక ఎన్నికల వరకు సీఎం కుర్చీని అంటిపెట్టుకోవాలని ఒకరి తాపత్రయం, మధ్యలోనే లాక్కోవాలని మరొకరి ఆరాటం. ప్రజలకిచ్చిన హామీల అమలు గాలికొదిలేసి, రాష్ట్రాభివృద్ధిని మరిచిపోయి, కేవలం కుర్చీలాట ఆడుతున్న కాంగ్రెస్ విధానం ప్రజాద్రోహమనే చెప్పాలి. ఐదేళ్లకు ఒకసారి వచ్చే అధికారాన్ని రెండున్నరేళ్ల కాంట్రాక్టుగా మార్చిన ఈ 'పవర్ షేరింగ్' సంస్కృతి రాష్ట్ర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.

*యం.చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

# మంచి నడత కోసం 'కట్టుబాట్లు'

మనసులో మాట 99

అంతర్జాతీయీకరణ, సమాచార విప్లవం కారణంగా ఆధునిక సమాజం పరిగెడుతున్న వేగం చూస్తే అద్భుతం అనిపిస్తుంది కానీ, అది వెళ్తున్న దారిని గమనిస్తే మాత్రం భయం వేస్తుంది. విద్యావంతులమని, నాగరికులమని, ఐటీ కారిడార్లలో జీవిస్తున్నామని మురిసిపోయే ఆధునిక పట్టణ సమాజం నేడు నిస్సహాయ స్థితిలో ఉంది. చిన్నపిల్లల్లో స్మార్ట్‌ఫోన్ వ్యసనం, మైనర్ల బైక్ రేసుల మరణ మృదంగం, వివాహాల పేరుతో జరుగుతున్న మితిమీరిన ఆడంబరాలు మధ్యతరగతి, నిరుపేద కుటుంబాల ఆర్థిక పునాదులను కదిలిస్తున్నాయి. చట్టాలు, ప్రభుత్వాలు, పోలీస్‌స్టేషన్లు ఎన్ని ఉన్నా ఈ సామాజిక రుగ్మతలను ఆపలేకపోతున్నాయి. చట్టానికి పరిమితులు ఉన్న చోట, ఒక వ్యవస్థను సన్మార్గంలో నడిపించడానికి కట్టుబాట్లు ఎంతగా ఉపయోగపడతాయో నిరూపిస్తూ భారతదేశంలోని కొన్ని మారుమూల గ్రామీణ, ఆదివాసి సమాజాలు నేడు దేశానికి కనువిప్పు కలిగించే నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టిస్తున్నాయి.

రాజస్థాన్‌లోని దూంగర్‌పుర్‌లో ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాల గిరిజన మహాసమితి సమావేశంలో ఒక విప్లవాత్మకమైన తీర్మానం చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వకూడదని, మైనర్లకు బైకులు ఇవ్వడం ఆపాలని, పెళ్లిళ్లలో డీజేలు, బంగారం వంటి దుబారా ఖర్చులను నియంత్రించి కేవలం సాంప్రదాయ వెండి నగలతోనే వివాహాలు జరపాలని వారు సామూహికంగా నిర్ణయించుకున్నారు. ఇది కేవలం ఒక గిరిజన తెగ తీసుకున్న నిర్ణయం కాదు, నేటి జనరేషన్ ఆల్ఫా, జెడ్ జనరేషన్ యువతను కాపాడుకోవడానికి ప్రతి గ్రామం అనుసరించాల్సిన ఒక అద్భుతమైన ఆదర్శ నమూనా. ఇలాంటి చైతన్యం దేశంలోని వివిధ మారుమూల ప్రాంతాల్లో వెల్లువెత్తుతోంది. తెలంగాణలోని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన మండలంలోని మారుమూల పల్లె ఖైరీగూడ గ్రామం ఇటీవల ఇలాంటి ఒక చారిత్రాత్మక నిర్ణయంతో వార్తల్లోకెక్కింది. పెళ్లిళ్ల పేరుతో జరుగుతున్న మితిమీరిన ఆడంబరాలను, సోషల్ మీడియా మోజులో చేస్తున్న ప్రీ-వెడ్డింగ్ షూట్‌లను, మానసిక ప్రశాంతతను దెబ్బతీసే డీజే సౌండ్లను ఆ గ్రామం నిషేధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే యాభై వేల రూపాయల జరిమానా విధిస్తామని గ్రామ సభ తీర్మానించింది. అదేవిధంగా, ఉత్తరాఖండ్‌లోని జౌన్సార్-బావర్ ప్రాంతానికి చెందిన ఖత్ సైలీ పరిధిలోని 25 గిరిజన గ్రామాలు ఏకమై, పెళ్లిళ్లలో నూడుల్స్, మోమోస్ వంటి ఫాస్ట్ ఫుడ్‌తో పాటు మద్యం సరఫరాను పూర్తిగా నిషేధించాయి. వాటి స్థానంలో స్థానిక పౌష్టికాహారమైన మందువా, జింగోరాలను వడ్డించాలని, ఉల్లంఘిస్తే లక్ష రూపాయల జరిమానా విధిస్తామని కట్టుబాటు పెట్టుకున్నాయి. అటు ఆదిలాబాద్ జిల్లాలోని 10 కోలాం గిరిజన గ్రామాలు తమ సంస్కృతిలోకి కొత్తగా చొరబడిన కట్నం అనే భూతాన్ని సామూహిక తీర్మానం ద్వారా బహిష్కరించాయి.

ఈ తీర్మానాలన్నీ ఒకే ఒక్క నిజాన్ని చాటిచెబుతున్నాయి: బాగా చదువుకున్నామని, ఆధునికులమని విర్రవీగే నగర సమాజాల కన్నా, అడవిని నమ్ముకున్న ఆదివాసీలకు, మారుమూల గ్రామీణ ప్రజలకే సమాజం యొక్క మంచి చెడులపై అత్యంత స్పష్టమైన అవగాహన ఉంది. పట్టణాల్లో తల్లిదండ్రులు తమ పిల్లల గారాబానికో, వారి ఒత్తిడి నుంచి తప్పించుకోవడానికో పదేళ్ల ప్రాయానికే చేతికి స్మార్ట్‌ఫోన్లు, 15ఏళ్లకే లైసెన్స్ లేకపోయినా బైకులు ఇచ్చి వారి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కానీ, అడవి బిడ్డలు మాత్రం మా కమ్యూనిటీలో ఏ మైనర్ చేతిలోనూ ఫోన్, బైక్ కనిపించకూడదు అని కట్టుబాటు పెట్టుకున్నారు. ఇది పిల్లలపై నిర్బంధం కాదు, వారి భవిష్యత్తును కాపాడే ఒక రక్షణ కవచం. ఒకరు ఫోన్ ఇస్తే తన బిడ్డ కూడా అడుగుతాడనే భయం తల్లిదండ్రులకూ లేకుండా, అందరూ కలిసి ఒకే నియమాన్ని పాటించడం వల్ల ఇక్కడ ఒక సానుకూల సామాజిక ఒత్తిడి ఏర్పడుతుంది.

అంతేకాకుండా, తరతరాలుగా లేని ఆచారాలు నేడు వేడుకల పేరుతో కొత్త ఆచారాలుగా స్థిరపడిపోతుండటం మన సంస్కృతికి పట్టిన అతిపెద్ద దుర్గతి. ఒకప్పుడు పెళ్లి అంటే రెండు మనసుల, రెండు కుటుంబాల కలయిక. కానీ నేడు అది సంపద ప్రదర్శన, ఒక జల్సా, ఒక వ్యాపారం. ప్రీ-వెడ్డింగ్ షూట్లు, హల్దీ వేడుకలు, రాత్రింబవళ్లు చెవులు బద్దలయ్యేలా మోగే డీజేలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ల హంగామా.. ఇవన్నీ మన ప్రాచీన సంస్కృతిలో లేనివి. ఎవరో చేశారని మరొకరు, వారిని చూసి ఇంకొకరు అప్పులు చేసి మరీ లక్షల రూపాయలు తగలేస్తున్నారు. ఈ ఆడంబరాల పోటీని తట్టుకోలేక ఎన్నో మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పెళ్లి రోజునాటి హంగామా ముగిశాక, మిగిలే అప్పుల భారం ఆయా కుటుంబాలను ఆత్మహత్యల వైపు నడిపిస్తోంది. ఈ నేపథ్యంలో, గిరిజన సమాజాలు కేవలం వెండి నగలతోనే పెళ్లిళ్లు చేయాలని నిబంధన పెట్టడం వెనుక ఉన్నది అపారమైన ఆర్థిక విజ్ఞత. దుబారా చేసే ఆ డబ్బును వృధా చేయకుండా పిల్లల ఉన్నత చదువులకు, వారి ఉపాధికి పెట్టుబడిగా పెట్టాలనే వారి ఆలోచన ఆధునిక సమాజానికి చెంపపెట్టు.

విద్యావంతులమని చెప్పుకునే నగర సమాజాల్లోని కొంతమంది క్లబ్బుల్లో, పబ్బుల్లో విలాసాలకు అలవాటుపడి నైతికంగా పతనమవుతుంటే, మారుమూల పల్లెలు నేడు దేశానికి సరికొత్త జీవన విధానాన్ని నేర్పుతున్నాయి. నాగరికత అంటే కాంక్రీట్ అడవులను నిర్మించడం కాదు, మానవ విలువలను కాపాడుకోవడం అని ఈ పల్లెలు నిరూపించాయి. చదువు పెరిగే కొద్దీ విచక్షణ కోల్పోతున్న ఆధునిక సమాజానికి, నిరక్షరాస్యులైన ఈ ఆదివాసీలు సామాజిక క్రమశిక్షణలో పీహెచ్‌డీ చేసి పాఠాలు చెబుతున్నట్లుగా ఉంది ఈ తీర్మానాల తీరు. మంచిని ఎక్కడి నుంచైనా స్వీకరించాలి. పల్లెలు, గిరిజన గూడేలు చూపిన ఈ దారిని నగర సమాజాలు కూడా స్వీకరించినప్పుడే, రేపటి తరాన్ని మనం ఆరోగ్యకరమైన, సంస్కారవంతమైన పౌరులుగా తీర్చిదిద్దగలము.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**



## సీఎం స్ఫూర్తితో..
# జిల్లాలో వేగంగా అభివృద్ధి
### - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో జిల్లాలో వేగంగా అభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన జిల్లాలో జల్‌జీవన్ మిషన్ కింద జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఖరీఫ్‌కు ముందే సాగునీటి పనులు పూర్తి చేయాలని, సోమశిల ఉత్తర, దక్షిణ కాలువల పనులు వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రూ. 3212 కోట్లు వ్యయమయ్యే ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ఈ వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# పారిశుద్ధ్య కార్మికుని కుటుంబానికి.. రూ.70 లక్షల ఆర్థిక భరోసా



బాధిత కుటుంబానికి చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

విధి నిర్వహణలో మృతి చెందిన ఆత్మకూరు మున్సిపాలిటీ శానిటరీ వర్కర్ చెంచు మల్లికార్జునరావు కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా నిలిచిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో మృతుని భార్య కామేశ్వరికి, ఆర్థిక సహాయానికి సంబంధించిన పురపాలక సంఘం జనరల్ ఫండ్స్ నుంచి 5లక్షల చెక్కును మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికుడు విధి నిర్వహణలో మృతి చెందితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఆ కుటుంబానికి దాదాపు రూ.70 లక్షల మేర ఆర్థిక భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఆత్మకూరు మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుంచి రూ. 5 లక్షలు మృతుని భార్యకు అందిస్తున్నట్లు తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ ఇన్సూరెన్స్ ద్వారా పిల్లల చదువుల కోసం రూ. 8 లక్షలు, మరో రూ. 20 లక్షల ఇన్సూరెన్స్ డబ్బు అందనున్నట్లు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌కు ఇన్సూరెన్స్ ఉండటంతో మరో రూ. 35 లక్షలు ఇన్సూరెన్స్ ద్వారా కూడా లభించనున్నాయని, అలాగే మృతుడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ తరఫున మరో రూ. 5 లక్షల సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఆత్మకూరులో నక్షత్ర వనం!

ఆత్మకూరు పట్టణంలోని రామాలయ ప్రాంగణంలో 27 నక్షత్రాలకు సంబంధించిన పవిత్ర మొక్కలతో ప్రత్యేకంగా "నక్షత్రవనం" ఏర్పాటు చేస్తున్నట్లు దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ఆత్మకూరు టిడ్కో కాలనీలో రామాలయ నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ, శ్రీవాణి భజన మందిరాల్లో మొట్టమొదటి ఆలయం ఆత్మకూరు రామాలయమన్నారు.

# 'పరిశుభ్రత' పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు

పరిసరాల పరిశుభ్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, అప్పుడే మన ప్రాంతాలు పరిశుభ్రమైన వాతావరణం, పచ్చదనంతో కళకళలాడుతాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో మే 22 నుంచి జూన్ 20 వరకు నాలుగు వారాల పాటు ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వారం ప్రత్యేక అంశాలపై దృష్టి సారిస్తూ ప్రధాన రహదారులు, కాలువలు, నాలాలు శుభ్రపరిచే పనులు, చెత్త వర్గీకరణ, ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా, స్టేడియం పరిసరాలను చీపురు పట్టి శుభ్రం చేస్తూ అధికారులు, ప్రజా ప్రతినిధులు పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. మేయర్ సుజాత, కమిషనర్ నందన్, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డును శుభ్రం చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల, కమిషనర్ నందన్, మేయర్ సుజాత, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

# నేరాల నియంత్రణకు.. కార్డెన్ సర్చ్!



జిల్లాలోని శివారు ప్రాంతాలు, నేరాలు జరిగేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్న ప్రాంతాల్లో జిల్లా పోలీసుయంత్రాంగం ఈనెల 24న పెద్దఎత్తున తనిఖీలు చేపట్టింది. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు, నేరాల నియంత్రణకు నిర్వహిస్తున్న కార్డెన్ సర్చ్‌లలో భాగంగా పోలీసులు ప్రతి ఇంటినీ పరిశీలించారు. ఇళ్లలో ఎవరెవరు ఉంటున్నారో ఆరా తీశారు. ఆధార్ కార్డులు పరిశీలించి, అనుమానాస్పద వ్యక్తులెవరైనా ఉంటే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. మత్తుపదార్థాల వినియోగం, అసాంఘిక కార్యక్రమాల పట్ల దృష్టి సారించి, వాటి నివారణకు అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాంటివారి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా జరిగిన ఈ తనిఖీలో సరైన పత్రాలు లేని 264 ద్విచక్రవాహనాలను, 11 ఆటోలు, 4 కార్లను స్వాధీనం చేసుకున్నారు.

## గాండ్ల తెలికుల సంఘం..
# సేవలు అభినందనీయం
### ఎంపీ వేమిరెడ్డి దంపతులు



విద్యార్థిని సత్కరిస్తున్న వేమిరెడ్డి దంపతులు, పక్కన గ్రోసు సుబ్బారావు, కమిటీ సభ్యులు

అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం వారు ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. రాష్ట్ర గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వర్గీయ గ్రోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్ ప్రదానోత్సవ కార్యక్రమం ఇటీవల నెల్లూరులోని మిని బైపాస్‌రోడ్డులోని ఓ కళ్యాణ మండపంలో నిర్వహించారు. విపిఆర్, ఆయన సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా విపిఆర్ మాట్లాడుతూ, మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు గోపాలయ్య హయంలో నెల్లూరులో వృద్ధాశ్రమం నిర్వహించేవారని అందులో తనకు భాగస్వామ్యం ఉందన్నారు. విద్యలో బాగా రాణిస్తున్న విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ గోల్డ్ మెడల్ పురస్కారాలు అందజేయడంతో పాటు, జిల్లాకు ఇద్దరు చొప్పున ఉత్తమ విద్యార్థులను ఎంపికచేసి ప్రతిభా పురస్కారాలు అందజేయడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులను అభినందించడాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. అఖిల గాండ్ల తెలికుల సంక్షేమం కోసం సంఘం ఏర్పాటు చేసిన స్వర్గీయ గ్రోసు గోపాలయ్య సేవలు అపూర్వమన్నారు. ఇప్పుడు వారి కుమారుడు గ్రోసు సుబ్బారావు, కమిటీ సభ్యులు ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తుండడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను గ్రోసు సుబ్బారావు ఆధ్వర్యంలో సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

# పడుగుపాడులో ఎంఎస్ఎంఈ పార్కు
### --- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి ---



ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపన మహోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

ఈనెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా 39 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా కోవూరు నియోజకవర్గం పడుగుపాడులో నూతన ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాతో పాటు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ, పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రబిందువుగా కోవూరు మారుతోందన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో, ప్రతి కుటుంబంలో ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్న ముఖ్యమంత్రి ఆలోచనతో రూపుదిద్దుకున్నదే ఎంఎస్ఎంఇ పార్క్ అని, పడుగుపాడులో ఈ పార్క్ కోసం సుమారు 14.5 ఎకరాలు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ధన్యవాదాలు తెలిపారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యతో చాలామంది ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలను పరిష్కరించాలని ఆమె ఈ సందర్భంగా కలెక్టర్‌ని కోరారు.

# టీబీ పేషెంట్లకి 'విపిఆర్' పోషకాహారం

జాతీయ క్షయ వ్యాధి (టీబీ) నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, 'ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్' పథకం కింద నెల్లూరుజిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ముమ్మర చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని గుర్తించబడిన క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవడానికి అదనపు పోషకాహారం (న్యూట్రిషియన్ ప్రొటీన్ ఫుడ్) అందించేందుకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. జిల్లాలో గుర్తించబడిన సుమారు 700 మంది క్షయ వ్యాధిగ్రస్తులలో, 400 మందికి 6 నెలల పాటు బలవర్ధకమైన ప్రోటీన్లు కలిగిన ఆహార పదార్థాల కిట్లను (అడిషినల్ న్యూట్రిషియన్ సపోర్ట్ కిట్స్) అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా విపిఆర్ సహకారానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, హరీష్ పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణకు ఏర్పాట్లు పూర్తి

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

జిల్లాలో 2026 ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్, విధి విధానాలను వివరించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా నవీకరించడం, ధ్రువీకరించడం, తప్పులను సరిదిద్దడం లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు చురుకుగా సహకరించాలని కోరారు.

### ఎన్నికల సంఘం షెడ్యూలు :

ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం జూన్5 నుంచి 14 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, ఫారంల ముద్రణ వంటి పనులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను పరిశీలిస్తారని తెలిపారు. అదే సమయంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు, తెలిపారు. అదేరోజు నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను అధికారికంగా విడుదల చేస్తామని కలెక్టర్ వెల్లడించారు.

# డివిజన్ల పునర్విభజన అస్తవ్యస్థం

## • ఎమ్మెల్సీ పర్వతరెడ్డి విమర్శ



కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న పర్వతరెడ్డి

డివిజన్ల పునర్విభజన అంతా అస్తవ్యస్థంగా ఉందని, నగరాభివృద్ధికి విఘాతం కలిగేలా పునర్విభజన జరుగుతుండడం సరికాదని వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయమై ఈనెల 24న పార్టీ నాయకులతో కలసి ఆయన తన అభ్యంతరాలను తెలియజేస్తూ నగరపాలక సంస్థ కమిషనర్ నందన్‌కి వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ల సరిహద్దులను నిర్ణయించడంలో స్పష్టత లేదన్నారు. వైసీపీ తరపున తాము చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ ప్రక్రియలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్పులు చేయాలని కోరారు.

## 10న..జడ్పీ సమావేశం

నెల్లూరుజిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జూన్ 10వ తేదీన జరుగనుందని జడ్పీ సీఇఒ ఎల్.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత వహిస్తారని, జిల్లాలోని పలు శాఖల ప్రగతిని సమావేశంలో సమీక్షిస్తారని ఆయన పేర్కొన్నారు.



'నారాయణ నేత్ర జ్యోతి' శిబిరాన్ని పరిశీలిస్తున్న పొంగూరు షరణి

# ఇంటి వద్దకే కార్పొరేట్ వైద్యం

## మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి

ఇక ఇంటివద్దకే కార్పొరేట్ వైద్యం అందనుందని మంత్రి నారాయణ కుమార్తె పొంగూరు షరణి చెప్పారు. నెల్లూరు నగరంలోని 42వ డివిజన్ కోటమిట్టలో ఇటీవల 'నారాయణ నేత్ర జ్యోతి, దంత సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సుమారు రూ.3 కోట్ల వ్యయంతో అధునాతన సాంకేతికతతో రూపకల్పన చేసిన 'నారాయణ హాస్పిటల్ ఆన్ వీల్స్' ద్వారా ఇంటి వద్దకే అందుతున్న ఉచిత వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. స్థానికులకు అందిస్తున్న చికిత్సల వివరాలను వైద్య బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. మనిషి జీవితంలో అత్యంత ప్రధానమైన కళ్ళు, పళ్ళ ఆరోగ్యాన్ని కాపాడాలనే ఆశయంతో తమ తండ్రి మంత్రి నారాయణ నేతృత్వంలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా ఇప్పటివరకు 7,417 మందికి ఉచిత కంటి ఓపీ, 4,300 మందికి ఉచిత అద్దాల పంపిణీ, 104 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు.

### మూలాపేటలో స్కూల్ పనుల పరిశీలన :

ఈనెల 25న షరణి మూలాపేట బాలికోన్నత పాఠశాల ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వీఆర్సీ తరహాలో మూలాపేట బాలికోన్నత పాఠశాలను ఆధునీకరిస్తున్నామని, జూన్‌లో హైస్కూల్‌ని ప్రారంభిస్తామని తెలిపారు. మూలాపేట పాఠశాలను డిఎస్ఆర్ కన్స్ట్రక్షన్ అధినేత సుధాకర్‌రెడ్డి సిఎస్ఆర్ ఫండ్స్‌తో ఆధునీకరిస్తున్నారని వివరించారు. ఆధునీకరణ పనుల పర్యవేక్షణ బాధ్యత నాన్న తనకు అప్పగించారని, పేదపిల్లలకోసం జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగస్వామిని కావటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

# ఇచ్చిన హామీలు నెరవేర్చండి

## • బీసీల నేత డిమాండ్

ప్రభుత్వం బీసీలకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మి నాగకిషోర్ డిమాండ్ చేశారు. ఈనెల 26న నెల్లూరులోని యాదవభవన్‌లో జరిగిన బీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపుతున్నాయని, బీసీలు ఓటుబ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారి అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. ఆర్థికంగా, పారిశ్రామికంగా, రాజకీయంగా బీసీలు ఎదిగేందుకు ప్రభుత్వాలు ఇకనైనా కృషి చేయాలని ఆయన కోరారు. ఆ సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు, ముత్యంగౌడ్, గురవయ్య, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# కాత్యాయనీ వ్రతం

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 26న కాత్యాయనీ వ్రతాన్ని కన్నులపండువగా నిర్వహించారు. దంపతులు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ ఏలూరు శిరీష పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

# ఆదర్శప్రాయుడు.. డాక్టర్ విజయకుమార్



సభలో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

ప్రజాసైన్స్ ఉద్యమకారునిగా, సామాజిక సేవకునిగా ప్రసిద్ధిగాంచిన దివంగత డాక్టర్ విజయకుమార్ సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. డాక్టర్ విజయకుమార్ 11వ వర్ధంతిని పురస్కరించుకుని డాక్టర్ విజయకుమార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన సభలో వక్తలు ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డా. అంబేద్కర్ జీవితచరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ మాట్లాడుతూ, అంతరాలు లేని సమాజం కోసం అంబేద్కర్ జీవితాంతం కృషిచేశారన్నారు. డా. విజయకుమార్ డా. అంబేద్కర్ ఆశయాల బాటలో అందరికీ మార్గదర్శకంగా ఉంటూ, సమాజ చైతన్యం కోసం పాటుపడ్డారన్నారు. నగరంలో 'నెల్లూరు ఆసుపత్రి'ని నెలకొల్పి తక్కువ ఖర్చుతోనే ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. ట్రస్ట్ కార్యదర్శి కేవీ శేషారెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, జేవీవీ జాతీయ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, పర్యావరణవేత్త కుసుమకుమారి, సుజాత, చక్రపాణి, డాక్టర్ రఫీ, డాక్టర్ బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు ధర పెంపుపై..సీపీఎం నిరసన



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెట్రోలు, డీజల్, గ్యాస్ ధరల పెంపుపై ఈనెల 26న నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ధరల పెంపుతో సామాన్యుల జీవనం కష్టతరంగా మారిందంటూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, పార్టీ నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్‌లు మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కేవలం 10 రోజుల వ్యవధిలోనే నాలుగుసార్లు పెట్రోలు ధరలు పెంచడం దారుణమన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పెంచలనరసయ్య, సతీష్, అజీజ్, సుధాకర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మెకాలపు జీతాలివ్వాలి

## • కార్పొరేషన్ ఎదుట సీఐటీయు ఆందోళన



ఆందోళన చేస్తున్న సీఐటీయు నాయకులు

మునిసిపల్ కార్మికులకు సమ్మెకాలపు జీతాలు ఇవ్వాలని కోరుతూ, ఈనెల 25న సీఐటీయు ఆధ్వర్యంలోని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వారు నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మునిసిపల్ కార్మికులకు 14 రోజుల సమ్మెకాలపు జీతాలు చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసి నాలుగు నెలలవుతున్నా, ఇంతవరకు ఆ జీతాలను చెల్లించకపోవడం దారుణమని యూనియన్ నాయకులు కె. పెంచలనరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, జీతాల చెల్లింపుల విషయంలో ప్రతినెలా ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరించాలని ఆయన కోరారు. యూనియన్ జిల్లా నాయకులు, సీఐటీయు నేతలు పాల్గొన్నారు.






## పెరసం పురస్కారానికి..

# కవితా సంకలనాలు పంపండి

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) 17వ వార్షికోత్సవం సందర్భంగా ఇవ్వనున్న పెరసం సాహిత్య పురస్కారం-2026 కోసం కవులు, కవయిత్రులు తమ కవితా సంపుటాలను పంపవలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు. 2025 జనవరి నుండి 2025 డిసెంబర్ వరకు ముద్రించబడిన కవితాసంపుటాలను, 4 కాపీలు జులై 10వ తేదీలోగా పరిశీలనకి పంపాలని పెన్నా రచయితల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజు సుభద్రాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఫోన్:8500130770, 98486 27158 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## 'విపిఆర్ నేత్ర'..
# ఓ మహత్తర కార్యక్రమం
### ప్రశంసించిన మంత్రి ఆనం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఆనం, విపిఆర్ దంపతులు

కంటిచూపు సరిగా లేని గ్రామీణప్రాంత ప్రజలకు కంటిపరీక్షలు చేయించి, అవసరమైన చికిత్సలు నిర్వహించేందుకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు 'విపిఆర్ నేత్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం హర్షదాయకమని, అదొక మహత్తరమైన కార్యక్రమమని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రశంసించారు. ఈనెల 23న ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్ పేట మండలం చిరమన గ్రామంలో ప్రారంభమైన 'విపిఆర్ నేత్ర' కార్యక్రమంలో ఆయన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతిరెడ్డి దంపతులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామాల్లోని ప్రజలకు నాణ్యమైన కంటిచూపు ప్రసాదించాలనే, గ్రామాల్లోకి ప్రజల ముంగిళ్ళలోకి వెళ్ళి విపిఆర్ నేత్రబృందాలు రోగులకు కంటిపరీక్షలు చేస్తున్నారని, వేమిరెడ్డి దంపతులు సదాశయంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం స్ఫూర్తిదాయకమన్నారు. వారి దాతృత్వం వెలకట్టలేనిదని కొనియాడారు. ఈరోజు నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలోని 136 గ్రామపంచాయతీల్లో పెద్దఎత్తున విపిఆర్ నేత్ర కార్యక్రమం ద్వారా కంటి వైద్య పరీక్షలు అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో నిర్వహిస్తారని, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా అందజేస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా చిరమన గ్రామంలో రూ.50 లక్షలతో చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, 32 లక్షలతో 7 సిమెంట్ రోడ్లకు విపిఆర్‌తో కలసి ఆయన ప్రారంభోత్సవాలు చేశారు.

# ఓర్వలేకే.. లేనిపోని ఆరోపణలు

- **వైసీపీపై నారాయణ మండిపాటు**

రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారంటూ రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మండిపడ్డారు. ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని పరమేశ్వరినగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యావ్యవస్థలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలపాలన్నది యువ నేత నారా లోకేశ్ సంకల్పమని, వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామన్నారు. నెల్లూరు నగరంలో 15 వేల మంది నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. తొలుత ఆయన అక్కడున్న వక్ఫ్ బోర్డు స్థలంలో 20కోట్ల రూపాయల వ్యయంతో స్విమ్మింగ్‌పూల్‌తో కూడిన అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. గత ప్రభుత్వంలో పరిపాలన చేతకాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, ప్రస్తుతం చంద్రబాబు పాలనలో పారదర్శకంగా జరుగుతున్న ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక ప్రతిపక్షనేతలు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని ఆయన దుయ్యబట్టారు. పేద విద్యార్థుల పట్ల మంత్రి నారాయణ చూపుతున్న ప్రత్యేక చొరవను డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రశంసించారు. సొంత నిధులు, సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్న మంత్రి నారాయణ తీరు అభినందనీయమన్నారు. వక్ఫ్ బోర్డు స్థలంలో స్కూల్ నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.



స్కూల్ కాంక్రీట్ పనులను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, అబ్దుల్ అజీజ్








జననం
01.02.1942

నిర్యాణం
28.05.2025

# ప్రథమ వర్ధంతి

మా కుటుంబ కీర్తి, మా అభివృద్ధికి స్ఫూర్తి

**పెనుబోలు రాజగోపాలరెడ్డి** గారు

మాజీ డైరెక్టర్, కోరా విద్యాసంస్థలు

స్వర్గస్తులై తేది. 28.05.2026 గురువారం నాటికి

ఏడాది గడిచిన సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

భార్య : **పెనుబోలు ఇందిరమ్మ**

కుమారుడు - కోడలు

**పెనుబోలు మహేష్‌కుమార్‌రెడ్డి - దీప**

కుమార్తె - అల్లుడు

**సామంతు లక్ష్మీశిరీష - సామంతు శ్రీధర్‌రెడ్డి**

మనుమలు

**పెనుబోలు కునాల్‌రెడ్డి**

**పెనుబోలు మనోవిరాజ్‌రెడ్డి**

**సామంతు యోహిత్‌రెడ్డి**

మనుమరాళ్ళు

**శ్రావ్య - అమీత్, లాస్య - విషాల్**

మునిమనుమరాళ్ళు

**త్రిషిక, మిహిర**

మరియు **కుటుంబసభ్యులు**

# అర్హుల ఓట్లను కాపాడుకోవాలి

• పార్టీ శ్రేణులకు రామ్‌కుమార్‌రెడ్డి సూచన



ఓటర్ల జాబితా సవరణలో పార్టీ బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలని, అర్హుల ఓట్లు కాపాడాలని వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, తిరుపతి ఎంపీ డా.గురుమూర్తి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇటీవల వారు వెంకటగిరి లోని నేదురుమల్లి నివాసంలో పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశమై మాట్లాడుతూ, వైసీపీ హయాంలో పార్టీ కార్యకర్తలు ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారన్నారు. టిడిపి కార్యకర్తలు తమ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని వారు ఈ సందర్భంగా విమర్శించారు. బీఎల్ఏ అనేది పదవి కాదని, అదొక కీలక బాధ్యత అని వారు చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి పార్టీ బిఎల్ఏలు జగన్ పాలన, టిడిపి పాలన తేడాలను ప్రజలకు వివరించాలన్నారు. దొంగ ఓట్లు చేరినా.. అర్హుల ఓట్లు తొలగినా బాధ్యత బిఎల్ఏలదే అని స్పష్టం చేశారు. బిఎల్ఏలు సైనికుల్లా పనిచేసి జగన్‌ను మళ్లీ సీఎం అయ్యేందుకు కృషిచేయాలని వారు కోరారు. జోనల్ ఇంచార్జ్ శివశంకర్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సీపి అబ్జర్వర్ కోడూరు కల్పలత, ఎస్సీసీ సభ్యులు మధురెడ్డి, మండలాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టుకు..ఎన్‌బీకేఆర్ విద్యార్థులు

నెల్లూరులో ఇటీవల నిర్వహించిన జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికల్లో ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి నెల్లూరుజట్టుకు ఎంపిక కావడం విశేషం. నెల్లూరు జిల్లా తరఫున జరిగిన ఈ ఎంపికల్లో ఆ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో నెల్లూరు జట్టుకు ఎంపికైన ఎం.జితేంద్ర, పి.గోపిచంద్, కె.సూర్య దినేష్‌లు మే 27 నుండి 29 వరకు విజయనగరంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ, మరియు నెల్లూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా. వి.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర సీనియర్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్లో ఈ క్రీడాకారులు పాల్గొని తృతీయ స్థానం సాధించడం గర్వకారణమన్నారు. ఆ జట్టులో ఎన్.వినయ్‌కుమార్ కూడా ఉన్నారని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ, కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి క్రీడలకు విశేష ప్రోత్సాహం అందిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## నిత్యాన్నదానానికి..
# 10 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న మల్లికార్జున

నెల్లూరు వాస్తవ్యులు, వ్యాపారవేత్త కొమ్మి మల్లికార్జుననాయుడు, వారి కుటుంబసభ్యులు జొన్నవాడ దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదానానికి 10,30,232 రూపాయలు విరాళంగా అందజేశారు. ఎస్ఎస్ మోడరన్ రైస్ ఇండస్ట్రీ పేరున మరియు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర మోడరన్ రైస్ ఇండస్ట్రీ పేరున వారు ఇటీవల ఈ విరాళమిచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలతో శ్రీ మల్లికార్జునస్వామి-కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

## డ్వామా ఏపీడీగా..
# ప్రమీలారాణి

తిరుపతిజిల్లా పెళ్ళకూరులో ఎంపీడీఓగా పనిచేస్తున్న ఏ.ప్రమీలారాణిని కోవూరు డ్వామా ఏపీడీఓగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలిచ్చింది.

## రాజ్యసభ పిటిషన్స్ కమిటీ..
# సభ్యునిగా బీఎంఆర్



రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్)ను రాజ్యసభ పిటిషన్స్ కమిటీ సభ్యునిగా నియమిస్తూ రాజ్యసభ ఛైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 మే 20వ తేదీ నుంచి అమల్లోకి వచ్చే విధంగా కమిటీని పునర్వ్యవస్థీకరించినట్లు తాజాగా పార్లమెంటరీ బులెటిన్‌లో వెల్లడించారు. ఈ కమిటీకి రాఘవ్ చద్దా ఛైర్మన్‌గా నియమితులయ్యారు. దేశవ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చే వినతులు, ప్రజా సమస్యలు, పాలనాపరమైన అంశాలపై పరిశీలన చేసి సంబంధిత శాఖలకు సూచనలు చేసే కీలక బాధ్యతలను ఈ కమిటీ నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, తనను రాజ్యసభ పిటిషన్స్ కమిటీ సభ్యునిగా నియమించినందుకు భారత ఉపరాష్ట్రపతి మరియు రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు మార్గనిర్దేశనం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, విద్యామంత్రి లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు.

## కార్పొరేట్ చట్టాల బిల్లుపై..మంచి సూచనలు అందజేస్తా!

కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లుపై..సమర్థవంతమైన సూచనలు అందజేసి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తానని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ (బీఎంఆర్) చెప్పారు. కార్పొరేట్ రంగంలో పారదర్శకత, పెట్టుబడిదారుల రక్షణ, ఆర్థిక వ్యవస్థ బలోపేతం మరియు వ్యాపార నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "కార్పొరేట్ చట్టాల (సవరణ) బిల్లు-2026"పై అధ్యయనం చేయడానికి ఏర్పాటుచేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీలో ఆయన సభ్యులుగా నియమితులయ్యారు. ఇలాంటి కీలకమైన చట్ట సవరణలను పరిశీలించే సంయుక్త పార్లమెంటరీ కమిటీలో బీఎంఆర్‌కి స్థానం కల్పించడం ఆయనకు ఉన్న పార్లమెంటరీ అనుభవానికి, పారిశ్రామిక రంగంపై ఉన్న అవగాహనకు కేంద్రం ఇచ్చిన గౌరవంగా భావించవచ్చు. ఈ సందర్భంగా బీఎంఆర్ మాట్లాడుతూ, రాజ్యసభలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ, పారిశ్రామిక, వాణిజ్య మరియు వ్యాపార రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్పొరేట్ చట్టాల బిల్లును అధ్యయనం చేయడానికి అవకాశం కల్పించిన రాజ్యసభ ఛైర్మన్ మరియు భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కి, మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌కి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# గూడూరు డివిజన్

## ఇంటికో పారిశ్రామికవేత్త తయారుకావాలి

ఎమ్మెల్యే సునీల్‌కుమార్




శంకుస్థాపన మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఈ నెల 25వ తేదీ చిల్లకూరు మండలంలోని కడివేడు రెవెన్యూ పరిధిలో దాదాపు 44 ఎకరాల్లో రూ.10.50 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా సుమారు వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వివరించారు. బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీతో రుణాలు అందించే వెసులుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం డీడీ శ్రీధర్, ఏపిఐఐసి మేనేజర్ బీఎల్ ఆచార్యులు, తహశీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో గోపి, పెంచలకోన ఆలయ మాజీఛైర్మన్ తానంకి నానాజీ, రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి ఆర్డీవోగా అనూష



గూడూరు ఆర్డీవో ఇ.వి.సత్యనారాయణను ప్రభుత్వం రామాయపట్నం పారిశ్రామిక క్లస్టర్, కందుకూరు, కావలి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేయడంతో నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూషకి గూడూరు ఇన్‌ఛార్జి ఆర్డీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

## పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

• ఎంపిడిఓ మధుసూదన్‌రావు



గూడూరు మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తైన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గూడూరు ఎంపిడిఓ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఈ నెల 25న గూడూరు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాలులో మండలంలోని ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని, ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా ప్రతి టీచరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎం.ఈ.వో-2 కాంచన, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు



పలసరుకులు పంపిణీ చేస్తున్న ప్రగతి సేవకులు

గూడూరులోని ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో కీర్తిశేషులు పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం, వారి కుమారుడు పొణకా మల్లికార్జునరెడ్డి ఆర్థిక సహకారంతో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ నెల 25న గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియం నందు ఈ కార్యక్రమం జరిగింది. నిత్యం పట్టణాన్ని శుభ్రం చేస్తూ, సమాజ సేవలో ముందంజలో ఉండే 15 మంది పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలను గుర్తించి, వారికి నెలకు సరిపడా 18 రకాల నాణ్యమైన పలసరుకులను అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, కాటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## పొణకా దంపతులకి జేవీవీ కృతజ్ఞతలు

పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల నుండి టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను ఇటీవల జేవీవీ సభ్యులు సత్కరించి, గడియారాలు, జ్ఞాపికలు, జిప్‌ఫైళ్ళు అందించారు. పిఎస్ఆర్ ట్రస్టు సహకారంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది. ఇందుకు కృతజ్ఞతగా జేవీవీ ప్రతినిధులు ఈ నెల 24న పిఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పొణకా శివకుమార్‌రెడ్డి, స్వర్ణాంధ్ర సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేన దంపతుల ఇంటికి వెళ్ళి వారిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పొణకా దేవసేన మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ప్రతినిధులు చెంచు నారాయణ, పురుషోత్తం రావు, రామ్మోహన్, ఆనంద్, ఇబ్రహీం, ప్రభాకర్ పాల్గొన్నారు.

## రాంజీ చట్టాన్ని రద్దు చేయాలి

- ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పోలయ్య

గ్రామీణ పేద ప్రజల పొట్ట కొట్టే వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్ గర్ అండ్ ఆజీవిక మిషన్ (విబి-జి రాంజీ చట్టాన్ని) రద్దు చేయాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.పి.పోలయ్య డిమాండ్ చేస్తూ మంగళవారం గూడూరు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఉపాధిపై తీవ్ర దెబ్బ కొట్టిందని విమర్శించారు. జూలై 1 నుండి వీబీ జీరాంజీ చట్టాన్ని అమలు చేయడానికి కేంద్రం సమాయత్తమైందని, దీనివల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతున్నా చంద్రబాబు కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు.

## బ్రహ్మశ్రీ బాలసుబ్రహ్మణ్యశర్మకు..

# ప్రముఖుల సత్కారం



బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మను సన్మానిస్తున్న ప్రముఖ అవధానులు, కవిపండితులు

కాకినాడ జిల్లా మాధవపట్నానికి చెందిన ప్రముఖ పండితులు..సాహితీబంధు, 'ఛందశ్శాస్త్ర రత్నాకర' బిరుదాంకితులైన బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మను ఈనెల 24న హైదరాబాదులోని అవధాన విద్యా వికాస పరిషత్ వారు ఘనంగా సత్కరించారు. ఆ పరిషత్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకి ఈ సన్మానం జరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అవధాన విద్యను ప్రోత్సహిస్తూ గత అయిదేళ్ళుగా ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి 25 మంది అవధానులను సిద్ధం చేసిన సందర్భంగా నిర్వహించిన ఆ పరిషత్ పంచమ వార్షిక విజయోత్సవ సభలో.. బాలసుబ్రహ్మణ్యశర్మను ప్రముఖ అవధానులు, సారస్వతవేత్తల సమక్షంలో సత్కరించడం విశేషం. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త-అవధాని డా. రేవూరు అనంతపద్మనాభరావు మాట్లాడుతూ, అవధాన విద్య ఆంధ్రుల సొత్తు అని, అది కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్య అతిథిగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు, శతావధానులు ఆముదాల మురళి, ఓం ప్రకాశ్, ఉప్పలధడియం భరత్, అవధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, మామిడూరు సోదరులు, కవిపండితులు బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకరశర్మ, మరుమాముల దత్తాత్రేయశర్మ, డా. సంగనభట్ల నరసయ్య తదితరులు పాల్గొని పద్యవిద్యలో బాలసుబ్రహ్మణ్యశర్మ ప్రతిభాపాటవాలను కొనియాడారు. ఈ సందర్భంగా సంగనభట్ల నరసయ్యను 'దేశీచ్ఛందోంబుధి' అనే బిరుదుతో సన్మానించారు. తెలుగుభాషా వికాస ఉద్యమసారథి జాగర్లపూడి సీతారామకృష్ణ శర్మ, శంకరాభరణం వాట్సాప్ గ్రూప్ వ్యవస్థాపకులు కంది శంకరయ్య తదితరులను కూడా ఈ సభలో సన్మానించి, పద్యకవిత్వంలో వారు చేస్తున్న విశేష కృషిని అభినందించారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎన్జీవో నాయకులు

ఉద్యోగుల సమస్యలకు సంబంధించి పలు విషయాలను ఇటీవల ఏపీ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు విన్నవించారు. పలు సమస్యలను కలెక్టర్‌కు తెలియజేసి, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆ సంఘం నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కాకుల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుకు వెలుగునిస్తున్న 'మనసు ఫౌండేషన్'



రమేష్‌ని సత్కరిస్తున్న 'నెరసం' సభ్యులు

తెలుగుభాషకి వెలుగునిస్తూ, వేలాది పుస్తకాలను శాశ్వత ప్రాతిపదికన భద్రపరుచుకునే విధంగా డిజిటలైజ్ చేస్తూ, మహత్తరమైన అక్షరయజ్ఞం చేస్తున్న 'మనసు ఫౌండేషన్' రచయితలకు ఒక గొప్ప వరమని నెల్లూరుజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ చెప్పారు. ఈనెల 25న వారు నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలంలోని కనియంపాడు గ్రామంలో ఉన్న 'మనసు ఫౌండేషన్' కార్యాలయాన్ని సందర్శించి అక్కడ పుస్తకాలను డిజిటలైజ్ చేస్తుండటాన్ని పరిశీలించి, వారు చేస్తున్న అక్షర సేవలను ప్రశంసించారు. కవులు.. రచయితలు తాము రాసిన పుస్తకాలు కాలగర్భంలో కలిసిపోతాయని ఆందోళన చెందుతున్న తరుణంలో మనసు ఫౌండేషన్ వారు వ్యయ ప్రయాసలను లెక్కచేయకుండా వేలాది పుస్తకాలను డిజిటలైజ్ చేసి శాశ్వతంగా అందరికీ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నారని, వారికున్న తెలుగు భాషాభిమానం నిరుపమానమని కొనియాడారు. పుస్తకాలు డిజిటలైజేషన్ చేయటంతో పాటు స్థానికంగా ఉన్న యువతకు అందులో ఉపాధి కల్పిస్తున్న వ్యవస్థాపకులు డా. మన్నం వెంకటరాయుడును వారు అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక నిర్వాహకుడైన రమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షురాలు అరుణా సందడి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్ లైబ్రేరియన్..

# పూసపాటికి డాక్టరేట్



రామిరెడ్డిని అభినందిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో పనిచేస్తున్న లైబ్రేరియన్ పూసపాటి రామిరెడ్డికి చిత్తూరు జిల్లాలోని ద్రవిడియన్ యూనివర్సిటీ (కుప్పం) నుంచి డాక్టరేట్ లభించింది. ఈనెల 22న ఆయనకు డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. "ది యూజ్ ఆఫ్ ఓపెన్ ఎడ్యుకేషనల్ రిసోర్సెస్(ఓఇఆర్) ఇన్ సెలెక్ట్ ఇంజనీరింగ్ కాలేజెస్ ఆఫ్ రాయలసీమ రీజియన్ (ఆంధ్రప్రదేశ్)- ఏ స్టడీ" అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేసినట్లు తెలిపారు. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ అవినేని కిషోర్ తన పరిశోధనలకు మార్గదర్శకుడిగా వ్యవహరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ కరెస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాసులు ఆయన్ను అభినందించారు.

# 31న వేద విజ్ఞాన వేదిక సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా 173వ ప్రసంగ కార్యక్రమం ఈనెల 31న జరుగనుంది. సుప్రసిద్ధ కవిపండితులు డా. అద్దంకి శ్రీనివాస్ పాల్గొని 'పోతన భాగవత అవతారిక-వేదాంత రహస్యాలు' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు చెన్నైలోని టీ-నగర్ కృష్ణాహాల్, ఆంధ్రా క్లబ్‌లో జరిగే సభలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొంటారని, సాహిత్యాభిమానులు పాల్గొని సభను జయప్రదం చేయాలని వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## బాలల జాతీయ పురస్కారాలకు..

# దరఖాస్తులు పంపండి

జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనపరచిన 5 నుండి 18 ఏళ్ళలోపు వయసు గల బాలల నుండి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బి. హేనా సుజన్ తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సంస్కృతి వగైరాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ కనపరచిన బాలలు తమ దరఖాస్తులను జులై 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ జాతీయ పురస్కారాలకు ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తారని ఆమె వివరించారు.

# జీవితాలను మార్చగలిగేది..మంచి ఆలోచనలే!




మన కాలం ఒక అద్భుతమైన మార్పుల యుగం. మనిషి ఆలోచన, పరిశోధన, సృజన ఈ మూడు కలిసి ప్రపంచాన్ని కొత్త దిశల్లో నడిపిస్తున్నాయి. విద్యార్థులు భవిష్యత్తు గురించి ఆలోచించినప్పుడు, వారి ముందున్న అవకాశాల సముద్రంలో అత్యంత ప్రకాశవంతమైన మార్గం STEM Science (విజ్ఞానం), Technology (సాంకేతికం), Engineering (ఇంజనీరింగ్), Mathematics (గణితం). ఈ నాలుగు పదాలు వేర్వేరు అనిపించినా, అవన్నీ కలిసి ఒకే సత్యాన్ని చెబుతాయి: "జ్ఞానం మార్గం చూపుతుంది, శ్రమ గమ్యం చేరుస్తుంది." STEM వృత్తులు అంటే ఈ రెండు శక్తుల సమ్మేళనం. విజ్ఞానం అంటే మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం. ఒక చిన్న పిల్లవాడు "ఆకాశం నీలంగా ఎందుకు కనిపిస్తుంది?" అని అడిగిన ప్రశ్నలోనే విజ్ఞానానికి విత్తనం ఉంది. ఆ ప్రశ్నే ఒక రోజు అతన్ని వాతావరణ శాస్త్రవేత్తగా మార్చవచ్చు. సాంకేతికం అంటే మన ఆలోచనలను యంత్రాల రూపంలో నిలబెట్టడం. ఒక విద్యార్థి కంప్యూటర్‌లో చిన్న ప్రోగ్రామ్ రాస్తూ "ఇది ఎలా పనిచేస్తుంది?" అని ఆశ్చర్యపోతాడు. ఆ ఆశ్చర్యమే ఒక రోజు అతన్ని కృత్రిమ మేధ (AI)నిపుణుడిగా తీర్చిదిద్దవచ్చు. ఇంజనీరింగ్ అంటే సమస్యను చూసి పరిష్కారం నిర్మించడం. ఒక గ్రామంలో నీరు నిలిచిపోతే, దానికి డ్రైనేజీ మార్గం ఆలోచించే యువకుడు ఇంజనీర్. దానికి నీటి పారుదల మార్గం రూపొందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాడు. ఈ చిన్న మార్పు గ్రామం మొత్తం జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచింది. గణితం అంటే ఆలోచనకు క్రమం, లెక్కకు లయ. ఒక విద్యార్థి గణితం నేర్చుకుంటూ "ఇది ఎందుకు అవసరం?" అని అనుకుంటాడు. కానీ అదే గణితం ఒకరోజు అతన్ని డేటా సైంటిస్ట్‌గా ప్రపంచాన్ని విశ్లేషించే స్థాయికి తీసుకెళ్తుంది.

మన పురాణాల్లో ఒక గొప్ప సూక్తి ఉంది. "విద్యా దదాతి వినయం." STEM విద్య కూడా అదే వినయాన్ని నేర్పుతుంది- ప్రపంచం ఎంతపెద్దదో, మనం తెలుసుకోవాల్సింది ఇంకా ఎంత ఉందో గుర్తు చేస్తుంది. విజ్ఞానం, సాంకేతికం, ఇంజనీరింగ్, గణితం..ఇవి నాలుగు వేర్వేరు మార్గాలు కాదు; ఇవి నాలుగు కాళ్లతో నిలబడే ఒకే వేదిక. ఆ వేదికపై నిలబడిన విద్యార్థి ప్రపంచాన్ని మార్చగలడు. ఒక చిన్న గ్రామంలో చదువుకున్న అమ్మాయి, ఇంట్లో ఉన్న పాత రేడియోను తెరిచి "ఇది ఎలా పనిచేస్తుంది?" అని తెలుసుకోవాలనుకుంది. ఆ ఆసక్తి ఆమెను ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌కి తీసుకెళ్లింది. నేడు ఆమె శాటిలైట్ కమ్యూనికేషన్‌పై పనిచేస్తోంది. ఆమె ప్రయాణం ఒక చిన్న పరికరంతో మొదలై, అంతరిక్షం వరకు చేరింది. ఇదే STEM యొక్క శక్తి. మరో ఉదాహరణ. ఒక బాలుడు బయాలజీ పుస్తకంలో DNA గురించి చదివి ఆశ్చర్యపోయాడు. "మనిషి శరీరంలో ఇంత అద్భుతమైన కోడ్ ఉందా?" అని ఆలోచించాడు. ఆ ఆలోచన అతన్ని బయోటెక్నాలజీ వైపు నడిపించింది. నేడు ఆ విద్యార్థి అరుదైన వ్యాధులపై పరిశోధనలు చేస్తున్నాడు. ఒక చిన్న ఆశ్చర్యం, ఒక చిన్న ప్రశ్న..అవి జీవితాన్ని మార్చగలవు. విద్యార్థుల్లో STEM ఆసక్తి పెంచాలంటే ప్రాయోగిక కార్యకలాపాలు, నిజజీవిత ఉదాహరణలు మరియు సృజనాత్మక సమస్యల పరిష్కార అవకాశాలను అందించడం ఎంతో సహాయపడుతుంది.

మన పెద్దలు చెప్పిన మాట: "అభ్యాసే శక్తి." STEM రంగాల్లో రాణించడానికి ఈ మాటే మూలం. ప్రతిరోజూ కొంచెం నేర్చుకోవడం, కొంచెం ప్రయోగించడం, కొంచెం ఆలోచించడం.. ఇవి విద్యార్థిని ముందుకు నడిపే మూడు అడుగులు. గణితం కష్టంగా ఉన్నా, విజ్ఞానం క్లిష్టంగా కనిపించినా, సాంకేతికం కొత్తగా అనిపించినా, అభ్యాసం ఉంటే ఏదీ అసాధ్యం కాదు. STEM వృత్తులు మార్కుల మీద ఆధారపడవు; అవి ఆసక్తి, పట్టుదల, పరిశీలన మీద ఆధారపడతాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం..ఈ ముగ్గురి పాత్ర కూడా ఇందులో ఎంతో ముఖ్యమైనది. పిల్లల ఆసక్తిని గుర్తించడం, ప్రశ్నలు అడగడానికి ప్రోత్సహించడం, చిన్న ప్రయోగాలు చేయడానికి అవకాశం ఇవ్వడం..STEM విద్యకు పునాది. ఒక చిన్న సైన్స్ కిట్, ఒక పాత కంప్యూటర్, ఒక చిన్న రోబోటిక్స్ కిట్..ఇవి పిల్లల భవిష్యత్తును మార్చగలవు.

భవిష్యత్తు ప్రపంచం పూర్తిగా మారబోతోంది. AI, రోబోటిక్స్, గ్రీన్ ఎనర్జీ, బయో ఇన్ఫర్మాటిక్స్, స్పేస్ టెక్నాలజీ.. ఇవి అన్నీ వచ్చే దశాబ్దాల్లో అత్యంత అవసరమైన రంగాలు. ఈ రంగాల్లో పనిచేసే యువత ప్రపంచాన్ని మరింత సురక్షితంగా, ఆరోగ్యంగా, సుస్థిరంగా మార్చగలుగుతుంది. STEM వృత్తులు కేవలం ఉద్యోగాలు కాదు; అవి సేవ, సృష్టి, సమాజ నిర్మాణం. ఒక ఇంజనీర్ నిర్మించిన వంతెన వేల మందిని కలుపుతుంది. ఒక శాస్త్రవేత్త చేసిన పరిశోధన లక్షల మందికి ఆరోగ్యం ఇస్తుంది. ఒక టెక్నాలజీ నిపుణుడు రూపొందించిన సాఫ్ట్‌వేర్ కోట్ల మందికి సౌలభ్యం ఇస్తుంది. ఒక గణిత శాస్త్రవేత్త కనుగొన్న సిద్ధాంతం శతాబ్దాల పాటు ప్రపంచాన్ని నడిపిస్తుంది. ఈ వ్యాసం చదివే ప్రతి విద్యార్థికి ఇదొక సందేశం: "నీ ఆసక్తి-నీ భవిష్యత్తు." STEM రంగాలు నీకు ప్రపంచాన్ని తెరుస్తాయి. నువ్వు ఎక్కడి నుంచి వచ్చినా, ఏ పాఠశాలలో చదివినా, నీ చేతుల్లో ఉన్న ఆసక్తి, నీ మనసులో ఉన్న ప్రశ్నలు, నీ కళ్లలో ఉన్న కలలు.. ఇవే నిన్ను ముందుకు నడిపిస్తాయి. మన పురాణాల్లో ఒక సూక్తి ఉంది: "జ్ఞానమే పరమబలం' అని. STEM విద్య ఆ బలాన్ని నీ చేతుల్లో పెడుతుంది. ఆ బలంతో నువ్వు నీ జీవితాన్ని మాత్రమే కాదు, ప్రపంచాన్ని కూడా మార్చగలవు.



**వచ్చే వారం:** మానసిక-సామాజిక శాస్త్రాలు: రెండోస్థానం లోని కావు...అవి మనిషిని మలిచే మహాశక్తులు

E-mail: reddyu@gmail.com

# పురాతన ఆలయానికి..అధునాతన శోభ

## 'మధ్య రంగ' ఆలయంలోని.. లక్ష్మీదేవి గుడికి కొత్త కళ తెచ్చిన ఆల్తూరు మహేష్‌రెడ్డి కుటుంబం



ప్రముఖ ఆధ్యాత్మిక సేవాపరాయణులు..మన నెల్లూరీయులు, ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఛైర్మన్ ఆల్తూరు మహేష్‌రెడ్డి నేతృత్వంలో ఇటీవల కర్నాటకలోని శివనసముద్రం వద్ద ఉన్న పురాతన 'మధ్య రంగ దేవాలయం'కి అధునాతన శోభ చేకూరింది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న శ్రీరంగనాథస్వామి దేవాలయంతో పాటు, శ్రీ రంగనాయకి అమ్మవారి ఆలయం (శ్రీ మహాలక్ష్మీదేవి ఆలయం) పునరుద్ధరణ-ఆధునీకరణ పనులతో ఆ ఆలయాలకు కొత్త కళ తెచ్చారు. ఆల్తూరు వారి కృషితో శోభాయమానంగా రూపొందిన ఈ ఆలయాలను ఆల్తూరు మహేష్‌రెడ్డితో పాటు, ఆయన సతీమణి రాధిక, కుమారుడు నితీష్, కోడలు కీర్తి తదితర కుటుంబసభ్యులంతా దర్శించుకుని పూజలు చేశారు.

మీద పవళించినట్లుండే శ్రీ శయన రంగనాథుని ఆలయం, శ్రీ రంగనాయకి అమ్మవారి ఆలయం కాలక్రమంలో శిథిలావస్తకు చేరుకోవడంతో వాటిని పునరుద్ధరించాలని దేవాదాయశాఖ సంకల్పించి 2021లో పనులను ప్రారంభించింది. అయితే, అవి నత్తనడక నడవడంతో ఆ పనులను ఆల్తూరు మహేష్‌రెడ్డి సారధ్యంలోని ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ సంస్థ 2024 సెప్టెంబర్‌లో చేపట్టింది. మహేష్‌రెడ్డి రంగంలోకి దిగేదాకా ఆ ఆలయాల పరిస్థితి దీనంగానే ఉండేది. పూర్తిగా శిథిలావస్తకు చేరుకున్న శ్రీ రంగనాయకి అమ్మవారి (మహాలక్ష్మీదేవి) ఆలయానికి పూర్తిగా తమ సొంత నిధులతో జీర్ణోద్ధరణ గావించి అక్టోబరు



కార్యక్రమంలో పాల్గొన్న ఆల్తూరు నితీష్‌రెడ్డి దంపతులు, కర్నాటక ఉపముఖ్యమంత్రి (కొత్త ముఖ్యమంత్రి) డి.కె.శివకుమార్, ఆల్తూరు మహేష్‌రెడ్డి దంపతులు



కలశ ప్రతిష్టాపన చేస్తున్న ఆల్తూరు మహేష్‌రెడ్డి -రాధిక, నితీష్‌రెడ్డి - కీర్తి దంపతులు

కర్ణాటకలోని ప్రాచీన పుణ్యక్షేత్రాలలో శ్రీ రంగనాథుని దేవాలయాలకి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ ఆలయాల్లో 'ఆది రంగ దేవాలయం' శ్రీరంగపట్నంలో, 'మధ్య రంగ దేవాలయం' శివనసముద్రంలో, 'అంత్య రంగ దేవాలయం' శ్రీరంగంలోనూ ఉన్నాయి. ఈ మూడు దేవాలయాలని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదం. ఈ యాత్రనే 'త్రి రంగ యాత్ర' అని కూడా అంటారు. బెంగళూరు నుంచి 115 కిలోమీటర్ల దూరంలో కావేరి నదీ ద్వీపంలో ఉన్న శ్రీ రంగనాథుని ఆలయం 'మధ్య రంగ ఆలయం'గా ప్రతీతి. ద్రవిడ వాస్తుశిల్పంతో ఉన్న ఈ ఆలయం 9వ శతాబ్దానికి చెందిందని చరిత్రకారుల అంచనా. శేషతల్పం

2025 నాటికి రికార్డు సమయంలోనే పూర్తిచేయడం విశేషం! ఆ తర్వాత మిగిలివున్న ఇతర పనులను, ఆలయంలో విద్యుదీకరణ, ఆలయ శిఖరానికి కలశాలు ఏర్పాటు చేయడం వంటి కార్యాలన్నిటినీ పూర్తిచేసి, మే 17 నుండి 21వతేదీ వరకు ప్రత్యేక పూజలు చేసి ఈ ఆలయాలను పున:ప్రారంభించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆల్తూరు కుటుంబసభ్యులు స్వామివారికి, అమ్మవార్లకి పూజలు నిర్వహించి, ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఇలా ఎన్నో ఆలయాల అభివృద్ధికి అండగా నిలుస్తూ, నిరంతరం భగవత్ సేవలో తరిస్తున్న ఆల్తూరు మహేష్‌రెడ్డికి, వారి కుటుంబసభ్యులకి.. 'లాయర్' అభినందనలు!...

# శ్రీసిటీలో..దివ్యాంగ యువతకు పారిశ్రామికవేత్తలుగా శిక్షణ



పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ సమక్షంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవగాహన ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న శ్రీసిటీ ఎం.డి డా.రవీంద్ర సన్నారెడ్డి

దివ్యాంగ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శ్రీసిటీలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. విజయవాడలో ఈ నెల 25న నిర్వహించిన ఎంఎస్‌ఎంఈ గ్రోత్ సమ్మిట్-2026లో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆ మేరకు ఆయన అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దివ్యాంగ యువతకు వ్యవస్థాపక శిక్షణ అందించేందుకు శ్రీసిటీ చొరవను అభినందించారు. సమర్థవంతమైన ప్రణాళిక, పనితీరు, నిరంతర కృషి వల్లే శ్రీసిటీ దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక పార్కులలో ఒకటిగా ఎదిగిందని ప్రశంసించారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి మరిన్ని ప్రైవేట్ సంస్థలు ముందుకు రావాల్సిన అవసరాన్ని శ్రీసిటీ ప్రయాణం, అనుభవం స్పష్టం చేస్తోందన్నారు. డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీ ఎప్పుడూ సమగ్ర అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దివ్యాంగ యువతకు వ్యవస్థాపక శిక్షణ, ఇతర నైపుణ్యాలు అందించడం ద్వారా వారికి స్వయంఉపాధి మార్గాలను సృష్టించడమే కాకుండా, సామాజిక సమానత్వం మరియు పారిశ్రామిక పురోగతి పట్ల తమ కట్టుబాటును మరింత బలపరుస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ "ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త" లక్ష్యానికి అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్‌లో కోటి మంది వ్యాపారవేత్తలను తయారుచేయాలనే సంకల్పానికి దివ్యాంగ యువత శిక్షణ కార్యక్రమం తోడ్పాటు అందించనుందని ఆయన వివరించారు.

# మహానాడు..సూపర్ హిట్!

## • తెలుగు తమ్ముళ్ళలో మహదానందం • 'స్త్రీశక్తి' థీమ్‌తో ప్రత్యేక ఆకర్షణ

మహానాడు సందర్భంగా నెల్లూరుజిల్లా వ్యాప్తంగా టీడీపీ కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. బుధవారం జరిగిన తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలు తెలుగు తమ్ముళ్ళకి మహదానందం కలిగించాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నాయకులు వర్చువల్‌గా ఈ కార్యక్రమాలను చూసేందుకు ఏర్పాట్లు చేశారు. అనేక ప్రాంతాల్లో నాయకులు పెద్దపెద్ద స్క్రీన్‌లు ఏర్పాటుచేసి, మహానాడులో జరుగుతున్న కార్యక్రమాలను అందరూ తిలకించే అవకాశం కల్పించారు. దీంతో అన్ని ప్రాంతాల్లోనూ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాలను వీక్షించాయి. ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు నగరంలో మంత్రి నారాయణలతో పాటు అన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకులు మహానాడు వీక్షణకు ఏర్పాట్లు చేశారు. నెల్లూరురూరల్‌లో 12 క్లస్టర్‌లలో జరిగిన మహానాడు కార్యక్రమాలలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు ఆయన తనయ వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పార్టీ జెండాని ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి

పార్టీ శ్రేణులు భారీస్థాయిలో పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ అహర్ని

న్నారని, త్వరలో దుగ్గరాజుపట్నంలో పోర్టు వస్తుందని ఆయన తెలిపారు. ఈ మహానాడు స్త్రీశక్తి థీమ్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో దాదాపు 1875



ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి సారధ్యంలో...



రూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో...



ఉదయగిరిలో కాకర్ల సురేష్ నేతృత్వంలో...

నెల్లూరు పార్లమెంటు పరిధిలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హైబ్రిడ్ మహానాడు వేడుకలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్



రూరల్‌లో కార్యకర్తలతో ఎంపీ బీద మస్తాన్‌రావు

శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరిలో కాకర్ల సురేష్‌లు ఆయా క్లస్టర్‌లలో విజయవంతంగా నిర్వహించారు. రూరల్‌లో జరిగిన మహానాడులో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో వేమిరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌బాబు సూచనల మేరకు నెల్లూరు పార్లమెంటు పరిధిలో హైబ్రిడ్ మహానాడులను క్లస్టర్ల వారీగా ఏర్పాటు చేశామని, శలు శ్రమిస్తున్నారన్నారు. జిల్లాలో ఇండోసోల్, బీపీసీఎల్ కంపెనీలను జులైలో ప్రారంభించుకునేందుకు సన్నాహాలు చేస్తు

## టీడీపీకి.. వేమిరెడ్డి దంపతుల 5 కోట్ల విరాళం

హైబ్రిడ్ విధానంలో అట్టహాసంగా ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ 'మహానాడు'లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. బుధవారం మహానాడు మొదటి రోజున తెలుగుదేశం పార్టీ నిధికి వీరు రూ. 5కోట్ల భారీ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షులు, సీఎం నారా చంద్రబాబు నాయుడు వేమిరెడ్డి దంపతులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

క్లస్టర్‌లలో మహానాడు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. మంత్రి నారాయణ ఆదేశాలతో నెల్లూరు సిటీలోని 14 క్లస్టర్లలో వర్చువల్ మహానాడును నిర్వహించారు. తెలుగుదేశం జెండా ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, ఇతర అగ్రనేతల ఉపన్యాసాలను అందరూ శ్రద్ధగా విన్నారు.

# 'మహానాడు' తెలుగు ప్రజలందరి పండుగ

● సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సోమిరెడ్డి

మహానాడు తెలుగు ప్రజలందరి పండుగ అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 12 క్లస్టర్లలో జరిగిన మహానాడు వేదికలపై ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమాల్లో భాగం పంచుకోవడం ఒక అదృష్టమన్నారు. తెలుగు వారి కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది టీడీపీయేనన్నారు. ఎన్టీఆర్ సారధ్యంలో ఎన్నో సంక్షేమపథకాలు పేదవారికి అందాయన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాల అమలులో మనరాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. రెండేళ్లుగా దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ఒక్క ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కోసమే కూటమి ప్రభుత్వం ఏటా రూ. 33వేల కోట్లు ఖర్చుపెడుతోందని తెలిపారు. దేశంలోని ఏడు రాష్ట్రాలు ఖర్చుపెడుతున్న మొత్తం కంటే ఇదే ఎక్కువ అని ఆయన వివరించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని గొలగమూడి, చెముదుగుంట, ముత్తుకూరు, బ్రహ్మదేవం, విలుకానిపల్లిలో జరుగుతున్న మహానాడు వేడుకలకు సోమిరెడ్డి హాజర య్యారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల తెలుగుదేశం పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, సర్వేపల్లి పరిశీలకులు జెన్ని రమణయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

ఎన్టీఆర్ ఆశయాలు నేటితరానికి స్ఫూర్తి అని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈనెల 28న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జయంతి వేడుకలను నిర్వహించారు. పలువురు అధికారులు ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం డిఆర్ఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ... తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. రాజకీయాల్లో ప్రజాసేవకు కొత్త నిర్వచనం ఇచ్చిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. సామాన్య ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల గుండెల్లో చిరస్థానం సంపాదించుకున్నారని తెలిపారు. మహిళలకు గౌరవ స్థానం కల్పించడం, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ఎన్టీఆర్ ప్రత్యేకత అని అన్నారు. యువత ఎన్టీఆర్ జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు.

# హాస్టళ్ళలో అడ్మిషన్లు పెంచండి

## సాంఘిక సంక్షేమ అధికారిణి శోభారాణి

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు(హాస్టళ్ల)లో అడ్మిషన్లు పెరిగేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సాంఘిక సంక్షేమ అధికారిణి శోభారాణి సూచించారు. ఈనెల 27న ఆమె పొదలకూరులోని ఏఎస్‌డబ్ల్యుఓ కార్యాలయంలో ఆరు మండలాలకు చెందిన సంక్షేమ అధికారులు, సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2026–27 విద్యా సంవత్సరానికి హాస్టళ్లలో అడ్మిషన్లు పెంచేందుకు చేయాల్సిన కృషిని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని, వాటిని విద్యార్థులకు తల్లిదండ్రులకు మరింత వివరంగా తెలియజెప్పాలని కోరారు. గ్రామస్థాయిలో ఆమేరకు విస్తృతంగా ప్రచారం జరగాలన్నారు. అదేవిధంగా, తల్లికి వందనం పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వారి బ్యాంక్ ఖాతాలకు ఆ డబ్బు జమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, పోషకాహారంతో పాటు, నాణ్యమైన విద్యను వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆ వివరాలన్నీ విద్యార్థుల తల్లితండ్రులకు విశదీకరించాలని సూచించారు. ప్రత్యేకించి పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు విశేష శిక్షణతో పాటు, డిజిటల్ లెర్నింగ్, పోటీ పరీక్షలకు అవసరమైన మార్గదర్శకాలను సూచించడం వంటివి కూడా ఉంటాయన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పించేందుకు ముందుకు వచ్చేలా వారిని చైతన్యవంతం చేయాలని కోరారు.

# చిన్నబజార్ ఇన్స్‌పెక్టర్‌గా శ్రీనివాస్



నెల్లూరులోని చిన్నబజారు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టరుగా.. సీఐడీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆమేరకు గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి నుంచి ఉత్తర్వులు రావడంతో, శ్రీనివాస్ బుధవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా అక్కడ పనిచేస్తున్న చిట్టెం కోటేశ్వరరావు సెలవుపై వెళ్లడంతో, ఆ స్థానంలో ఆయన్ను నియమించారు.

### జనగణన

# పారదర్శకంగా నిర్వహించాలి

## అధికారులకు కలెక్టర్ సూచన

జిల్లాలో చేపట్టిన జనగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులకు సూచించారు. బుధవారం నెల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 27 వార్డు, ఆమంచర్ల, పొదలకూరులోని విజ్ఞేశ్వరపురం – 2 తదితర ప్రాంతాలలో కలెక్టర్ పర్యటించి క్షేత్రస్థాయిలో జనగణన మరియు ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జన గణన జరిగేటప్పుడు కొంతమంది ఇంటికి తాళం వేసి ఉండడం లేదా పనికి వెళ్లడం జరుగుతోందని, వాటిని కూడా మరలా పరిశీలించి సమగ్రంగా నివేదిక రూపొందించాలన్నారు. మూడు నాలుగు రోజులలో జనాభా సవరణ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగ అనూష, మండల రెవెన్యూ అధికారులు కృష్ణప్రసాద్, శివకృష్ణ, మండల పరిషత్ అధికారులు, ఎన్యూమరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### మనుబోలులో

# వేసవి శిక్షణా శిబిరం

మనుబోలులోని గ్రంథాలయాలో చిన్నారులకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ అధికారిణి ధనమ్మ ఆధ్వర్యంలో ఈనెల 27న చిన్నారులకు దేశభక్తి గీతాలను ఆలపించడం నేర్పించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు పత్రికాపఠనం పట్ల ఆసక్తిని కలిగించారు. చిన్నపిల్లలకు కథలు చదవడం నేర్పించారు.

# 'నన్ను కూడా ప్రశ్నించవచ్చు'

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ

ప్రశ్నించే తత్వం పెరగాలి. ముఖ్యంగా యువత ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలి. తనకు ఓట్లు వేసిన గెలిపించిన ప్రజలకు నన్ను ప్రశ్నించే హక్కు ఉంది. అందుకే 'నన్ను ప్రశ్నించవచ్చు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నా' అంటూ, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజలకు మరింత దగ్గరయ్యారు. ఇటీవల ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి తన అభిప్రాయాలను వెల్లడించారు. నెల్లూరు రూరల్‌లో తనను ప్రజలు గెలిపించాక, చరిత్ర ఎరుగని అభివృద్ధిని రూరల్‌లో చేసి చూపించామన్నారు. అయితే, గత రెండేళ్లలో కనుపర్తిపాడు ఎస్.సి.కాలనీలో ఒక్క పనికూడా జరగకపోవడం విచారకరమని ఆయన బాధను వ్యక్తం చేస్తూ, అందుకు కనుపర్తిపాడు ఎస్.సి. కాలనీ ప్రజలకు క్షమాపణ చెబుతున్నానన్నారు. గత ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన కనుపర్తిపాడు ఎస్.సి. కాలనీ ప్రజలకు రుణపడి ఉన్నానన్నారు. వెంటనే ఆ కాలనీలో 50 లక్షల రూపాయలు వ్యయమయ్యే అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచి తీరాలని అధికారులను ఆదేశించానని ఆయన వివరించారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదిక..మహిళా కార్యవర్గం

జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా మహిళా కమిటీ కార్యవర్గాన్ని ఈనెల 27న ఎన్నుకున్నారు. నెల్లూరులోని డాక్టర్ జి.విజయకుమార్ మెమోరియల్ ట్రస్ట్ ఆసుపత్రిలో జరిగిన జేవీవీ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో, జిల్లా కమిటీ గౌరవాధ్యక్షురాలిగా అనూరాధ, అధ్యక్షురాలిగా ఎం.శివపార్వతి, ఉపాధ్యక్షురాలిగా సుజాత, ప్రధాన కార్యదర్శిగా కె.లీలమ్మ, కోశాధికారిగా ఎన్. ప్రియాంక ఎన్నికయ్యారు. అదేవిధంగా సభ్యురాళ్లుగా ఎస్‌కె వహీదా, నారాయణమ్మ, స్వరూప, ఎస్‌కె అబ్జాలునిషా, సుధ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జాతీయ అధ్యక్షురాల స్వరాజ్యలక్ష్మి, రాష్ట్ర సమత అధ్యక్షురాలు సమత, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాసులు, జేవీవీ వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 'సమాజంలో మహిళల పాత్ర ఏటు?' అనే అంశంపై జరిగిన సదస్సులో జేవీవీ రాష్ట్ర, జాతీయ నాయకురాళ్లు పాల్గొన్నారు.

# అటు ఎండలు..ఇటు ఈదురు గాలులు

## ● నష్టాలతో తోటల రైతులు విలవిల



ఈదురు గాలులకు కరెంటు తీగలపై విరిగి పడిన చెట్లు

రోహిణిలో రోళ్లు పగులుతాయని పెద్దలు చెప్తుంటారు. అట్లనే ఉంది ఇప్పుడు పరిస్థితి. జిల్లాలో ఒకవైపు ఎండలు మంటలు పుట్టిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి దాకా ఒకటే సెగలు.. పొగలు. ఉక్కపోత. రోడ్లు నిప్పులగుండంలో ఉండడంతో బయటకి వెళ్లాలంటేనే జనం భయపడుతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఎండలు మండిపోతుంటే, సామాన్య జనం బిక్కచచ్చిపోతున్నారు. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతుండడం వడగాలులు వీస్తున్నాయి. వడదెబ్బకి వృద్ధులు వడలిపోతున్నారు. అయితే, మరోవైపు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులు, వానలు భీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. మంగళ, బుధ, గురువారాల్లో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు వీచి, కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. చెట్లు కూలిపోయాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి, ఈదురుగాలుల ధాటికి పండ్ల తోటలు, ఆకుతోటలు బాగా దెబ్బతిన్నాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉన్న నిమ్మ, బొప్పాయి, తమలపాకు, మామిడి, అరటి తోటలు పెనుగాలుల వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 42.40 హెక్టార్లలోని తోటలు, ఉద్యానపంటలు ఈదురు గాలుల వల్ల ధ్వంసమయ్యాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో బుధవారం రాత్రి కురిసిన వాన, వీచిన గాలుల దెబ్బకి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రెండు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌సిబ్బంది వెంటనే మరమ్మత్తులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వింజమూరు, సీతారామపురం, కలువాయి తదితర ప్రాంతాల్లో అకాల వర్షాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. భూతాపం పెరిగిపోయి ఎండలు మండుతూనే ఉన్నాయి..వానలు కురుస్తూనే ఉన్నాయి..ఎండాకాలంలో ఈ విచిత్ర వాతావరణంతో ప్రజలు నానా అవస్థలకు గురవుతున్నారు. రానున్న రోజుల్లో ఈ ఎండలు ఇంకా మరింత భగ్గుమంటాయని వాతావరణ శాస్త్రవేత్తల అంచనా. మరి ఎన్ని రోజులు ఈ కష్టాలో తెలియదు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నీడపట్టున ఉండి, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

## నాన్నకి నీడగా.. బాబాయ్‌కి తోడుగా..

## కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూతురు

# సాయి వైష్ణవి రాజకీయ బాట

**నెల్లూరు రూరల్ రాజకీయాల్లో కొత్త సందడి మొదలైంది. ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుమార్తె కోటంరెడ్డి సాయి వైష్ణవిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టడంతో యువతలోను, మహిళల్లోనూ నూతనోత్సాహం వచ్చింది.**

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏ పని చేసినా అందులో ఒక ప్రత్యేకత ఉంటుంది. అలాగే, రాజకీయాలలో ఆయన తీసుకునే నిర్ణయాలలో కూడా చాలా దూరదృష్టి దాగివుంటుంది. శ్రీధర్‌రెడ్డి తాత రాజకీయ నాయకుడు కాదు. తండ్రి కోటీశ్వరుడు కాదు. తన పూర్వీకులకి రాజకీయ నేపథ్యం లేదు. ఈ మాటలు ఆయనే అప్పుడప్పుడూ చెప్తూ ఉంటారు. విద్యార్థి నాయకుడిగా రాజకీయాలలో అడుగుపెట్టి, ఉద్యమ నాయకుడిగా గుర్తింపు సాధించి అంచెలంచెలుగా ఎదిగి 2014లో ఆయన నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి తొలిసారిగా ఘన విజయం సాధించారు. ఆ తరువాత తనదైన శైలిలో రాజకీయాలలో రాణిస్తూ రూరల్ నియోజకవర్గాన్ని తన కంచుకోటగా మార్చుకున్నారు. వరుసగా 2019, 2024 ఎన్నికలలో గెలుపుని తన సొంతం చేసుకున్నారు. పార్టీల జెండాలు అజెండాలు సైతం లేక పోయినా తన సొంత ఛరిష్మా తోనే గెలుపు బాటలో పయనించగలిగేలా రూరల్ నియోజకవర్గం ప్రజల అభిమానాన్ని పొందగలిగారు.

ఇప్పుడు తాజాగా ఆయన తన చిన్న కుమార్తె సాయి వైష్ణవిని ప్రత్యక్ష రాజకీయాలలోకి తీసుకురావడం జిల్లా రాజకీయాలలో చర్చనీయాంశంగా మారింది. కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాలు వైష్ణవి ప్రత్యక్ష రాజకీయ ప్రవేశం ఆధారంగా కోటంరెడ్డి సోదరుల మధ్య అగ్గి రగల్చాలని చూసినా వైష్ణవి మాత్రం తమ నాన్న, బాబాయ్‌ల మాటే తనకి వేదవాక్కు అన్నట్లుగా స్పష్టతనిచ్చారు. భవిష్యత్తులో ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేస్తారా అన్న ప్రశ్నకి కూడా పార్టీ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటానని నర్మగర్భంగా సమాధానం చెప్పారు.

### సేవా నేపథ్యం నుంచి..

వైష్ణవి రాజకీయ ప్రవేశం అకస్మాత్తుగా జరిగింది కాదు. గత ఎన్నికల సమయంలో తండ్రి శ్రీధర్‌రెడ్డి విజయం కోసం సోదరి హైందవితో కలిసి గడప గడపకూ తిరిగారు. ప్రతి డివిజన్, ప్రతి గ్రామంలోని ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నారు. క్లిష్ట సమయాల్లో కేడర్‌కు కొండంత ధైర్యం ఇచ్చి, తండ్రికి అండగా నిలిచారు. ఆ అనుభవమే నేడు ఆమెను నాయకురాలిగా నిలబెట్టింది.

తొలి ప్రెస్‌మీట్‌లోనే వైష్ణవి తన పట్టును నిరూపించుకున్నారు. రూరల్ నియోజకవర్గంలోని 26 డివిజన్లు, 18 గ్రామాల పేర్లు, అక్కడి ముఖ్య నాయకుల వివరాలు గుక్క తిప్పకుండా చెప్పి అక్కడ ఉండేవాళ్ళందరూ అవాక్కయ్యేలా చేశారు. నాయకురాలు కావాలంటే ముందుగా ప్రజలను, కార్యకర్తలను పేరు పేరునా గుర్తుపట్టాలి అనే సూత్రాన్ని ఆమె పాటిస్తున్నారు. జాతీయస్థాయిలో మహిళా రిజర్వేషన్ బిల్లు దిశగా అడుగులు పడుతున్న తరుణంలో వైష్ణవి ఎంట్రీ ఎంతో సమయోచితం అన్న మాటలు పార్టీ వర్గాల నుండి వినపడుతున్నాయి.



'నెల్లూరు రూరల్‌లో ఎల్లప్పుడూ టీడీపీ జెండానే ఎగరాలి' అని వైష్ణవి స్పష్టం చేశారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, పార్టీ బలోపేతానికి పని చేస్తానని ప్రకటించారు. కోటంరెడ్డి కుటుంబానికి ప్రజాసేవ కొత్త కాదు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, 'వందలాది శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు' ప్రజల మదిలో ఉన్నాయి. ఆ వారసత్వాన్ని, పోరాటస్ఫూర్తిని పుణికి పుచ్చుకున్న వైష్ణవి, తండ్రికి తగ్గ తనయగా నిలుస్తారనే నమ్మకం కార్యకర్తల్లో ఉంది.

విద్య, వినయం, క్షేత్రస్థాయి అవగాహన కలగలిసిన వైష్ణవిని ఓ విధంగా తన రాజకీయ వారసురాలిగా శ్రీధర్‌రెడ్డి ప్రకటించారని రూరల్ ప్రజలు, కోటంరెడ్డి అభిమానులు భావిస్తుండడం గమనార్హం. వైష్ణవి నాయకత్వం నియోజకవర్గానికి కొత్త దిశను చూపుతుందని ఆశిద్దాం. యువ తరం ప్రతినిధిగా, మహిళా నేతగా ఆమె రాజకీయ ప్రస్థానం విజయవంతం కావాలని ఆకాంక్షిద్దాం..!

### లోకేష్ నిర్ణయం.. చరిత్రాత్మకం

మహిళలకు 33శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామన్న లోకేష్ ప్రకటన చరిత్రాత్మకమని, దేశంలోని అన్ని పార్టీలు ప్రేరణగా తీసుకోవాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుమార్తె వైష్ణవి చెప్పారు. 2029 ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో 33 శాతం మహిళలకు కేటాయిస్తామని లోకేష్ ప్రకటించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా గౌరవం కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ దేశ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలిచాయని ఆమె కొనియాడారు.

## మూలాపేట స్కూలుకు..'దేవిరెడ్డి శారద' పేరు

నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పేరును మారుస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఈ పాఠశాల అభివృద్ధికి దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ వారు 10 కోట్ల రూపాయలు వెచ్చించి తరగతి గదులు, భవనాలు నిర్మిస్తుండడంతో, వారి సేవలకు గుర్తుగా ఆ పాఠశాలకు 'దేవిరెడ్డి శారద ప్రభుత్వ హైస్కూలు'గా పేరును నిర్ణయించారు. భవనాల నిర్మాణాలన్నీ పూర్తయ్యాక ఈ మార్పు అమలులోకి వస్తుందని తెలిపారు.




REMEMBERING OUR FOUNDER

Shri Nalagatla Krishna Reddy Garu

10 Nov 1935 - 2 June 2022

NAGARJUNA
GROUP OF RESTAURANTS
SINCE 1984

*Today, He may not be in our midst physically, But he has left behind an incredible impression on the many lives that he has touched. His story will be told in the years to come to Inspire Many More Generations about our Great Patriarch. And his food legacy will be carried on, with same passion that he passed on.*

HE LOVED HEARTILY, GAVE GENEROUSLY & LIVED FEARLESSLY.
AND AS HE WOULD ALWAYS SAY,
"I AM HERE, DON'T FEAR!"

Fondly Remembered by
**Family & Friends**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com